


# ఇరకం జాలర్ల సమస్యను ఇప్పటికైనా పరిష్కరించండి

తడ, మే 13 ప్రభాతవార్త : పులికాట్ సరస్సు మధ్యలోని తడ మండలం ఇరకంకుప్పం గ్రామ మత్స్యకారులు అక్కడి నుంచి సమీపంలోని పూడికుప్పానికి రావాలని కొన్నేళ్లుగా జరుపుతున్న పోరాటానికి సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మద్దతిచ్చారు. ఇరకం, పూడికుప్పం గ్రామాల కులపెద్దలు, ప్రజాప్రతి నిధులతో కలిసి ఆమె మంగళవారం జిల్లా కేంద్రానికి వెళ్లి కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్‌తో మాట్లాడారు. అనంతరం జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌కు జాలర్ల తరపున వినతిపత్రం అందజేశారు. గతంలో పూడికుప్పం వద్ద ఇళ్ల పట్టాలు మంజూరు చేసేందుకు అన్ని ఏర్పాట్లు జరిగినప్పటికీ కొన్ని అభ్యంతరాల వలన ఆ కార్యక్రమం నిలిచిపోయిందని గ్రామస్థులు తెలిపారు. ఇరకం దీవిలో నిత్యం సమస్యలతో పోరాడుతున్నామని, విద్య వైద్యం వంటి కోసం పడవలపై వెళ్లాల్సి వస్తుందని వీరు ఈ సందర్భంగా తెలిపారు. పూడికుప్పం వద్ద స్థలాలు తమకు అనుకూలంగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ సమస్యలన్నింటినీ విన్న ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి వారితో పాటు వెళ్లి జిల్లా అధికారులను కలిసి సమస్యను పరిష్కరించాలని కోరారు.


జిల్లా జాయింట్ కలెక్టర్‌కు ఇరకంకుప్పం తరపున అర్జీ అందిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

# కష్టపడితే పదవులు ఏవీ...బాబూ!

**-సీనియర్లకు మొండిచెయ్యే?**
**-ఎంఎల్ఏలకు అధిష్టానం నుండి కనీస సమాచారం కరువు**

**ప్రభాతవార్త-తిరుపతి:**
అయినవారికి ఆకుల్లో, కానివారికి కంచాల్లో అన్నట్లు అధికారంలో ఉన్న టిడిపి అధిష్టానం నిర్వాకం మారిందని కార్యకర్తలు బావురుమంటున్నారు. ఎన్నికల సమయంలో గుర్తుకు వచ్చే కార్యకర్తలు, పార్టీ నేతలు గెలిచి కుర్చీలు ఎక్కిన తరువాత గుర్తుకు రారనేది తెలుగుదేశంపార్టీ అధిష్టానంలో తేటతెల్లమైందని పలువురు సీనియర్ నేతలు ఆవేదనతో నలిగిపోతున్నారు. 2024 ఎన్నికల్లో అధికారంలోకి రావడానికి టిడిపి అధిష్టానం జనసేన, బిజెపిలతో కలసి కూటమిగా ఏర్పాటు కావడం, తిరుపతి స్థానాన్ని జనసేన పార్టీకి కేటాయి ంచడం, తదనంతర మార్పులతో చిత్తూరుకు చెందిన వైసిపి ప్రజాప్రతినిధి ఆరణి శ్రీనివాసులును తీసుకువచ్చి ఇక్కడ పోటీ చేయించడం, గెలుపులో టిడిపి కీలకపాత్ర పోషించడం జరిగిపోయింది. ఇక్కడ తాజాగా జనసేన ఎమ్మెల్యే కొనసాగుతున్నారు. ఇక తిరుపతి, చిత్తూరు జిల్లాలో దాదాపు 14 నియోజకవర్గాల్లో 12మంది టిడిపి పార్టీకి చెందిన సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఉన్నారు. కుప్పం నుండి గెలిచిన చంద్రబాబునాయుడు సిఎం కావడంతో సాధారణంగా మిగిలిన ఎమ్మెల్యేల్లో మంచివారు, జనంతో మమేకమైనవారికి మంత్రి పదవిదక్కుతుంది. అయితే గత ఏడాది మంత్రివర్గ కూర్పులో సిఎం సొంత జిల్లాకు ప్రాతినిధ్యం దక్కలేదు. పైగా పలమనేరు నుండి అమరనాథరెడ్డి ఒక్కరే సీనియర్‌నేత. మిగిలిన వాళ్ళంతా అంతా కొత్తగా తోలిసారిగా ఎంఎల్‌ఎగా పోటీచేసి గెలిచినవారే. వీరికి అనుభవం లేకపోవడంతో ఉన్న పరిస్థితుల్లో చంద్రబాబు తన సొంతజిల్లాలో ఎంఎల్ ఎలకు తగిన ప్రాధాన్యత ఇవ్వలేకపోయారు. ఇదే సర్వేతోనే మూడు విడతల నామినేటెడ్ పదవుల పందేరంలో కూడా తిరుపతి జిల్లాకు,ఉమ్మడి చిత్తూరు జిల్లాకు టిడిపి సీనియర్ నేతలకు మొండిచేయే చూపారు. తాజాగా నామినేటెడ్ పదవుల భర్తీలో సొంత జిల్లాకు చెందిన సీనియర్ నేతలకు ఎవరికీ పదవులు దక్కలేదు. పైగా నియోజకవర్గాల్లో నేతల పనితీరుపై ఎంఎల్‌ఎల అభిప్రాయం తీసుకుని వారి మాటగా నేతలకు పదవులు ఇవ్వడం రాజకీయ పార్టీల్లో ఉన్న వాస్తవం. అయితే టిడిపి అందుకు భిన్నంగా మారింది. సొంత పార్టీనేతలకు పదవులు ఇవ్వకపోవడంతో కార్యకర్తలు మండిపడుతున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పార్టీకోసం పనిచేసిన వారికి కాకుండా వైసిపి, కాంగ్రెస్ పార్టీల నుండి వచ్చిన నేతలకు పదవులు ఇవ్వడం ఎంతవరకు సమంజసమనే గొంతు విప్పుతున్నారు. ఇటీవల భర్తీచేసిన డిసిసిటి ఛైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డికి పదవి ఇవ్వడాన్ని పార్టీనేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ పదవిని బిఎన్ రాజసింహులు, చల్లా రామచంద్రారెడ్డి ఆశించారు. ఆదివారం నలుగురికి నామినేటెడ్ పదవుల్లో కూడా ఎంతో ప్రాధాన్యత ఉన్న తుడ ఛైర్మన్‌గా రియల్టర్ దివాకర్‌రెడ్డికి ఇవ్వడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ఆయన గత 2024వరకు వైసిపి అనుచరుడుగా చక్రం తిప్పాడనేది టిడిపిలో వాదనలు. ఈ పదవికి శ్రీకాళహస్తికి చెందిన ఎస్సీవి నాయుడు, తిరుపతి సూరా సుధాకర్‌రెడ్డి ఆశించారు. ఇక పిఆర్‌పి, జనసేన పార్టీలు మారిన డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్‌కు హస్తకళల బోర్డు ఛైర్మన్‌గా, సుగుణమ్మకు ఏమాత్రం ప్రాధాన్యతలేని పచ్చదనం,సుందరీకరణ ఛైర్మన్‌గా నియమించారు. దీన్నిబట్టి ఏదో పదవి ఇవ్వాలని సుగుణమ్మకు ఇవ్వడం జరిగిందనేది పార్టీలో సీనియర్‌లు గుర్రుమంటున్నారు. ఇప్పటికే నామినేటెడ్ పదవులు దక్కించు కున్న నేతలు కూడా సీనియర్ల పనితీరు, ఓటుబ్యాంకుపై చంద్రబాబు, లోకేశ్‌తో చర్చించే పరిస్థితిలో లేరు. చాలావరకు అసంతృప్తుల్లో వున్నవారితో పార్టీకి నష్టం తప్పదనేది కార్యకర్తలే బహి రంగంగా వ్యాఖ్యలు.



# అధికారుల పర్యవేక్షణతో... ప్రశాంతంగా జాతర


ప్రత్యేక అలంకరణలో గంగమ్మ, జాతరను పర్యవేక్షిస్తున్న అధికారులు

తిరుపతి(రవాణ),మే 13ప్రభాతవార్త: తిరుపతినగర జనం ఆశించిన స్థాయిలో ఈ ఏడాది గ్రామదేవత తాతయ్యగుంట గంగమ్మజాతర వేడుకలు కళ తప్పాయనే విమర్శలు జనంలో వ్యక్తమయ్యాయి. ఎంతో ఆర్భాటంగా, అద్భుతంగా జరిగే గంగమ్మజాతరను ఈ ఏడాది పేలవంగా జరిపించారనేది అర్థమవుతుంది. వారం రోజులు జరిగే జాతరలో వేషాలు పెద్దగా కనబడలేదు. పైగా జాతర మంగళవారం రోజు ఆలయంలో భక్తులరద్దీ కూడా నామమాత్రంగానే కనిపించింది. అయితే పటిష్ట ఏర్పాట్లు, భక్తుల సౌకర్యాలపై జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, నగరపాలక కమిషనర్ మౌర్య, గంగమ్మ ఆలయ ఈఓ జయకుమార్, ఆలయ జాతర కమిటీ చక్కగా సదుపాయాలు కల్పించారు.

**గంగమ్మ జాతర మంగళవారం ప్రశాంతంగా ముగిసింది:**
సోమవారం అర్ధరాత్రి శాంతిఅభిషేకం నిర్వహించిన ఆలయ అర్చకులు ఆ తరువాత తెల్లవారుజామున 4.30గంటల నుండి సామాన్యభక్తులకు దర్శనం కల్పించారు. బుధవారం తెల్లవారు జామున గంగమ్మప్రతిమ చెంప పేరంటాలు తొలగించడంతో జాతర ముగిసింది. భక్తులకు సకల సౌకర్యాలు కల్పించారు. తిరుపతి నగర డిఎస్పీ భక్తవత్సలం, క్రైమ్ డిఎస్పీ శ్యామ్‌సుందర్, సిఐలు రామకిశోర్, శ్రీనివాసులు, మురళీమోహన్. ఎస్ఐలు, పోలీసులు సిబ్బంది భారీ భద్రతలో నిమగ్నమయ్యారు.

## జాతరరోజు గంగమ్మకు మాజీమంత్రులు సారె :

తిరుపతినగర గ్రామదేవతగా పూజలందుకుంటున్న తాతయ్యగుంట గంగమ్మజాతర వేడుకల్లో మంగళవారం మాజీమంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు, ఆర్‌కె రోజా కుటుంబసభ్యులు పాల్గొన్నారు. ఉదయం గంగమ్మకు సారెను తీసుకు వచ్చిన మాజీమంత్రులు ఆలయంలో అమ్మవారికి సారె సమర్పించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ జయకుమార్, అర్చకులు అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.


గంగమ్మకు సారే సమర్పిస్తున్న మాజీ మంత్రులు

# చెరువు ఆక్రమణ.. ఏకంగా నగరమే నిర్మాణం!



పుంగనూరు, మే 13 ప్రభాతవార్త : మండలంలో నిర్మాణంలో ఉన్న జె టౌన్ ఎదురుగ పెంచుపల్లికు పోయే రహదారి ప్రక్కన చెరువు ఆక్రమణకు గురైందని అధికారులు పట్టించుకోలేదని అక్కడి ప్రజలు, నాయకులు ఆరోపించారు. ఈ మొత్తం ప్రాంతాన్ని అధికారులు వెంటనే సర్వే చేయాలని ఎందుకంటే గత ప్రభుత్వం అండదండలతో కొంతమంది నాయకులు ఇక్కడ ప్రాంతాన్ని చెరువులను పూర్తిగా ఆక్రమించుకుని వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. చెక్ డ్యాములు కాజ్వేలు వెడల్పుతూ ఉండగా విలువైన ప్రాంతా ల్లో వంకలను రాజకీయ అండతో కొందరు ఆక్రమించారనీ, చెరువును స్థలాలుగా ఆక్రమించి పలుచోట్ల నిర్మాణాలు చేశారని దుయ్యబట్టారు. గతంలో పుంగనూరులో రెండు పర్యాయాలు భారీ వర్షాలు కారణంగా వరద నీరు పారడానికి వంకలు ఆక్రమణలకు గురవడంతో వరదలు వచ్చి భారీ నష్టాలు జరిగాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఆక్రమణలను అడ్డుకునే ధైర్యం అధికారులకు లేకపోవడంతో రాజకీయ నేతలు ఆక్రమణలకు అడ్డు అదుపు లేకుండా పోయింది. ఇరిగేషన్ రెవెన్యూ అధికారులు స్పందించి చెరువు ఆక్రమణలు తొలగించడానికి సర్వే సర్వే చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఉమ్మడి భూములను సహజ వనరులను ఆక్రమించుకొని నిర్మాణాలు చేపట్టడంపై బీజేపీ నేతలు నిప్పులు చేరిగారు. క్రింద కనపరిచిన ప్రభుత్వ భూములు గురించి కలెక్టర్ గారికి, ఆర్డీవో, తహసీల్దార్ లకు ఫిర్యాదు చేసినా,స్పందించకపోవడం శోచనీయమన్నారు.పుంగనూరు టౌన్ ఆర్టీసీ డిపో ప్రక్కన సర్వే నెంబర్ 132/1, 132/3లో ప్రభుత్వ భూమి 0.38సెంట్లు ఉండగా 0.10 అక్రమణ జరిగింది అని రెవిన్యూ వాళ్ళు రిపోర్ట్ ఇచ్చారు. రాయలచెరువు మోరవ కాలువ సర్వే నెంబర్ 134ను ఖాతానెంబర్479గా ఆక్రమించి విక్రయాలు చేశారనీ,గుడిసెబండ గ్రామ పంచాయతీ సర్వే నెంబర్ 265 1 గుట్ట 1.55 సెంట్లు, సర్వేనెంబర్ 2652, 0.49సెంట్లు బంజర భూమి,సర్వే నెంబర్ 2662లో ఎ16.34 సెంట్లు, ధోబికాలనీ వద్ద అదృశ్యమైన వంక, రాయల్ చెరువు వంక నిండా ఆక్రమణలే అని దుయ్యబట్టారు. కౌండిన్య నదిలో భారీ భవనాల నిర్మాణం, చౌడేపల్లి రోడ్డులోని వంకలో ఆక్రమణల వెంటనే దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. మళ్లీ భారీ వర్షాలు పడితే మరోసారి వరద ముప్పును ఎదుర్కోవాల్సి వస్తుంది, ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి ఆక్రమణలు తొలగించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

# అట్టహాసంగా గంగజాతర ప్రారంభం

**- తొలి పూజ చేసి గంగమ్మను ఆవిష్కరించిన వంశ పారంపర్య ధర్మకర్త, మాజీ ఎమ్మెల్యే సికె బాబు- గంగమ్మను దర్శించుకున్న జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి - ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే గురజాల, ఎస్పీ మణికంఠ చందోలు, జిల్లా తెలుగుదేశం అధ్యక్షులు సిఆర్ రాజన్‌లు**



చిత్తూరురూరల్, మే 13 ప్రభాతవార్త: చిత్తూరు నడివీధి గంగజాతర మంగళవారం అత్యంత అట్టహాసంగా ప్రారంభమైంది, చిత్తూరు బజారు వీధిలో నడివీధి గంగమ్మతో పాటు గిరింపేట, మురకంబట్టు, దొడ్డిపల్లి, కొంగారెడ్డిపల్లి, సంతపేట ప్రాంతాల్లో గంగమ్మలు మంగళవారం తెల్లవారుజామున కొలువుతీరాయి. బజారువీధిలోని చిత్తూరు నడివీధి గంగమ్మకు గంగజాతర వంశపారంపర్య ధర్మకర్త, మాజీ ఎమ్మెల్యే సికె బాబు మంగళవారం తెల్లవారుజాము తొలి పూజ నిర్వహించడంతో గంగమ్మను భక్తులు దర్శించుకోవడం ప్రారంభించారు. జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చిత్తూరు నడివీధి గంగమ్మను దర్శించుకున్నారు. అలాగే జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి గిరింపేట, మురకంబట్టు, దొడ్డిపల్లిల్లో ప్రతిష్టించిన గంగమ్మలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా చిత్తూరు నడివీధి గంగమ్మకు ఇన్‌ఛార్జీ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగజాతర వంశ పారంపర్య ధర్మకర్త, మాజీ ఎమ్మెల్యే సికె బాబు జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రికి గంగమ్మ ప్రసాదాలు అందజేశారు.




# సత్యవేడు టిడిపిలో మితిమీరిన... స్థానికేతురుల పెత్తానం!

## -నిత్యం ప్రజల మధ్యలోనే, అయినా పట్టించుకోని ఎమ్మెల్యే




నారాయణవనం, మే 13 ప్రభాతవార్త : సత్యవేడు కంచికోటలో తెలుగు దేశం జెండాను నిలపడానికి అట్టడుగు కార్యకర్తలు నిబ్బద్ధతతో పని చేస్తుంటే పెత్తానం కోసం స్థానికేతుర అగ్ర వర్ణ నాయకులతో బీటలు వాలే ప్రమాదం పొంచి వున్నది. సత్యవేడు ఎస్సీ నియోజకవర్గం నుంచి వైసీపీ పుంచి టిడిపి లోకి వచ్చిన సిట్టింగ్ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలుగుదేశం గ్రూపు రాజకీయాలతో రెండవ సారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. అయితే సత్యవేడు టిడిపిలో దళిత నాయకత్వాన్ని జీర్ణోయించుకోలేని కొంతమంది అగ్రవర్ణాల నాయకులు స్వార్థ కుయుక్తులకు పాల్పడి పార్టీ ఢీలా పడే ప్రమాదం ఎంతో దూరంలో లేకపోలేదు. సత్యవేడు ఎస్సీ నియోజకవర్గంపై నాన్ ఎస్సీ నాయకుల పెత్తానం ఏమిటని వీధి వీధికి చర్చించుకుంటున్నారు. నాన్ ఎస్సీ నాయకులతో చేతులు కలిపిన కొంతమంది కుట్రలు, కుతంత్రాలతో ఎమ్మెల్యేపై నిందలు మోపే స్థాయికి దిగజారారు.

**ఎందుకీ అస్థిరం! :**
తొలి నుంచి సత్యవేడు ఎస్సీ నియోజకవర్గంలో ఆదిపత్యం వహిస్తూ వస్తోంది. కాంగ్రెస్ రెండు సార్లు, వైకాపా ఒక సారి మాత్రమే గెలవగలిగింది. 2024లో సత్యవేడు ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని గుర్తించి వైకాపా ఎమ్మెల్యేగా వున్న కోనేటి ఆదిమూలం ప్రజలకు చేస్తున్న సేవలను గుర్తించి టిడిపి నుంచి సీటు అందించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, నారా లోకేష్ మాటలకు కట్టుబడి గెలిపించారు. అయితే ఎమ్మెల్యేగా గెలిపి ంచినప్పటికి ఇతర నియోజకవర్గాలకు చెందిన అగ్ర వర్ణాల నేతల కుట్రలు, కుతంత్రాల కారణంగా అనవసరంగా ఎమ్మెల్యేను ఓ మహిళా పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడాన్ని సూట్ చేసి ఇరికించారు. అయితే ఆ కేసు కూడా కేవలం 19 రోజుల్లోనే వీగి పోవడంతో కేసును కొట్టేడం జరిగింది. అయితే క్రమశిక్షణకు మారు పేరు అయిన పార్టీ టిడిపి నేతలు ఎమ్మెల్యేపై పెట్టిన సస్పెండ్‌ని మాత్రం తీయలేదు. ఈ సస్పెండ్‌ని కూడా హై లెవల్‌లో తీసేయకుండా అడ్డుకు ంటున్నారనే విమర్శలు లేకపోలేదు. సిఎంతో పాటు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి కూడా వారి మాయమాటలను నమ్ముతు న్నారని చర్చించుకుంటున్నారు. గత ఎన్నికల్లో సత్యవేడు టిడిపి సీటు ఆశించిన మాజీ ఎమ్మెల్యే హేమలత, విశాఖపట్నంకు చెందిన యాతాటి రమేష్‌బాబులు సీటు రాకపోవడంతో తిరుగుబాటు ఎగరవేశారు. ఆ ఎన్నికల్లో హేమలత వర్గంతో పాటు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన యాతాటి రమేష్‌బాబు కోట్ల రూపాయాలను ఖర్చు చేసిన చివరకు టిడిపి అభ్యర్థిగా బరిలో నిలిచిన కోనేటి ఆదిమూలంను విజయపథం వరించింది. ఆ ఎన్నికల్లో సత్యవేడు నియోజకవర్గంలోని ఏడు మండలాల నుంచి స్వతంత్ర అభ్యర్థి యాతాటి రమేష్‌బాబు నుంచి లక్షల రూపాయాలను తీసుకొని ఆయన గుర్తు చెరుకుకు ఓటు వేయపోయిన పర్వాలేదు. సైకిల్ గుర్తుకు మాత్రం ఎట్టి పరిస్థితుల్లో వేయరాదని, చివరకు ఫ్యానుకు వేసిన పర్వాలేదని ప్రచారం చేశారు. ఆ ఎన్నికల్లో చెరుకు రసం తాగిన నేతలు నేడు ఎమ్మెల్యేను కాదని, ఇతర మండలాలకు చెందిన అగ్రవర్ణంకు చెందిన చంద్రశేఖర్, సూళ్లూరుపేటలకు చెందిన శ్రీపతిబాబు, హేమలత డబ్బులను కుమ్మరిస్తూ ఎమ్మెల్యేపై నిత్యం విషం చిమ్ముతున్నారు. గత ఎన్నికల్లో టిడిపికి ద్రోహం చేసిన వారిపై టిడిపి అధిష్టానం చర్యలు తీసుకోకుండా దళిత ఎమ్మెల్యేకు అన్యాయం చేయడం ఎంతవరకు న్యాయమని నియోజకవర్గ ప్రజలు ప్రశిస్తున్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖమంత్రి నారా లోకేష్‌లు క్షేత్ర స్థాయిలో జరుగుతున్న పరినామాలను గుర్తించి న్యాయం చేయాల్సిన అవసరం వుంది. లేకపోతే ఎస్సీ నియోజకవర్గంకు జరుగుతున్న అన్యాయంపైగల మెత్తడానికి టిడిపి శ్రేణులు సిద్దమవుతున్నారు.







# పైసల్లేక... నిరసిస్తున్న గ్రామ పంచాయతీలు


ఓ పంచాయతీలో అధికారులు పరిశీలిస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి,మే 13 ప్రభాతవార్త : పంచాయతీ ఎన్నికలు జరిగి 4సంవత్సరాల ఆరు నెలలు దాటినా పైసల్లేక, పనులు చేయలేక, గ్రామాల పరిస్థితి అథోగతిగా మారింది. వైకాపా పాలనలో శ్రీకాళహస్తిలోని నాలుగు మండలాల్లో పంచాయతీలు అన్ని ఏకగ్రీవమయ్యాయి. అయితే అప్పటిలో సర్పంచ్ పదవులు భారీ ఎత్తున అమ్మకాలు జరిగినట్లు కూడా విమర్శలు చోటు చేసుకున్నాయి. గ్రామాల్లో సర్పంచ్ పదవులు కావాలనుకున్న వారు ముడుపులు సమర్పించి సర్పంచ్ పదవులు పొందారు. కానీ తరువాత వారికి అర్థమైంది, పరిపాలనా తీరు ఏమిటో? 54 నెలలుగా పంచాయతీ సర్పంచ్‌గా ఉన్న నాయకుడు పంచాయతీలో ఒక్క పని చేయలేక పోయారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసే నిధులు కూడా గతంలో పరిపాలించిన రాష్ట్ర ప్రభుత్వం సర్దుబాటు చేసుకున్నారు. పంచాయతీల గురించి అభివృద్ధి గురించి ఎవరూ పట్టించుకోలేదు. మంగళవారం శ్రీకాళహస్తి మండలం బివిపురం సర్పంచ్ మాట్లాడుతూ గెలిచిన కొత్తలో ఉత్సాహంగా పంచాయతీలో పనులు చేయించాను. కానీ నాలుగున్నర సంవత్సరం దాటినా బిల్లులు చెల్లించక తిప్పలు పెడుతున్నారన్నారని తన ఆవేదనను వ్యక్తం చేయటం గమనించదగ్గ విషయం.

**కాలువల్లో మురుగు తీసే పరిస్థితి లేదు:**
ఉమ్మడి ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పంచాయతీలకు నిధులు మంజూరుకు ప్రకటించారు. రోడ్ల నిర్మాణానికి కాసులు మంజూరు చేసారు, కొన్ని పంచాయతీలు బాగుపడుతున్నాయి. అయితే పంచాయతీల్లో నేటికి ఒక లైట్ వేయటానికి కాసులులేక, ఇక మురుగునీటి కాలువ శుభ్రం చేసే పరిస్థితి లేదు. కనీసం వీదుల్లో బ్లీచింగ్ చల్లే పరిస్థితి లేక, వాతావారణం మార్పుతో రక రకాల వ్యాధులు సోకుతున్నా, కొళాయిల్లో సరఫరా చేసే మంచినీటిని క్లోరినేషన్ చేసే పరిస్థితి లేదు. పేరుకు సర్పంచ్ పదవి, కానీ ఒక్కటంటే ఒక్కపని చేయలేకపోయామనే నిరాశ నిసృహల్లో కొట్టుమిట్టాడుతున్నారు.పదవి కాలం పూర్తి కావస్తున్నా పంచాయతీల్లో చెప్పుకోదగ్గ పని ఒక్కటి కూడా చేయలేకపోయామనే నిరాశలో ఉన్నారు.



## నారసింహనపల్లెలో ఘనంగా బండిమీద కుంభం

**తవణంపల్లె, మే 4 ప్రభాతవార్త:** మండలంలోని నారసింహనపల్లె గ్రామంలో జరుగుతున్న మహాభారత యజ్ఞం కార్యక్రమంలో భాగంగా మంగళవారం బండిమీద కుంభం కార్యక్రమం గనంగా జరిగింది. గ్రామంలో 18 రోజుల పాటు జరిగే మహాభారత యజ్ఞం కార్యక్రమం ఈనెల 4న ఘనంగా ప్రారంభమైంది. ఇందులో భాగంగా ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో ఉదయం స్వామి, అమ్మవార్లకు ఉదయం ప్రత్యేకపూజలు నిర్వహించారు. పీలేరు శ్రీవెంకటేశ్వర నాట్యకళామండలికి చెందిన కళాకారులు బకాసురుడు వేషంలో బండిమీద కుంభం కార్యక్రమంను నిర్వహించారు. ఈకార్యక్రమంలో నారసింహనపల్లె పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు.

## యుబి.పల్లె వద్ద పొలాల్లోకి దూసుకువెళ్ళిన కారు



**తవణంపల్లె, మే 13 ప్రభాతవార్త:** అదుపుతప్పి కారు పొలాల్లోకి దూసుకువెళ్ళిన సంఘటన మండలంలోని ఉత్తర బ్రాహ్మణలపల్లె వద్ద మంగళవారం సాయంత్రం జరిగింది. వివరాలిలావున్నాయి. మండల కేంద్రం తవణంపల్లె బండమీద ఇండ్లుకు చెందిన ఓ వ్యక్తి ఏపి40 బిఎస్3964 నెంబరు కారులో తవణంపల్లె నుండి ఉత్తర బ్రాహ్మణపల్లె మీదుగా కాణిపాకం వైపు వెళుతూ అజాగ్రత్తగా నడపడంతో అదుపుతపి ్ప కారు రోడ్డు పక్కనున్న పొలాల్లోకి దూసుకుపోయింది. దీనితో కారు ధ్వంసమైంది. అలాగే కారు నడుపుతున్న వ్యక్తికి స్వల్పగా యాలయ్యాయి. ఇదిలా వుండగా రోడ్డు నుండి పొలాల్లోకి దూసుకుపోయిన సమయంలో పెను ప్రమాదం తప్పింది. కారు వి ద్యుత్ ట్రాన్స్‌పార్మర్‌కు కేవలం ఒక్క అడుగు దూరంలో నుండి పొలాల్లోకి దూసుకుపోయింది. అదే ట్రాన ్స‌పార్మర్‌కు ఢీకొని వుంటే పెను ప్రమాదం జరిగి వుండేది. సంఘటనా స్థలానికి స్థానిక పోలీసులు చేరుకుని పరిశీలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి వుంది.

## జంతువధ చేసేవారు పోలీసు ఐడి కార్డులు పొందాలి : డీఎస్పీ

**కుప్పం, మే 13 ప్రభాతవార్త :** కుప్పం శ్రీ తిరుపతి గంగమ్మ జాతర సందర్భంగా జంతువధ చేసే వ్యక్తులు ఈనెల 14-16 తేదీల మధ్య కుప్పం పోలీస్‌స్టేషన్‌లో ఐడి కార్డులు పొందాలని డీఎస్పీ పార్థసారథి పేర్కొన్నారు. ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజు ఫోటోతో పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. ఇరవై ఏళ్లు పైబడిన వారు, క్రిమినల్ కేసులు లేనివారికి కార్డులు అందిస్తామన్నారు. కుప్పం మండలంకు చెందిన వ్యక్తులకు మాత్రమే కార్డులు అందించడం జరుగుతుందని జంతు వధ సమయంలో మద్యం సేవించి ఉండరాదని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

## నీటిసంప్‌లో పడ్డ జింక.. రక్షించిన స్థానికులు



**కుప్పంరూరల్, మే 13 ప్రభాతవార్త :** కుప్పం మోడల్ కాలనీ సమీపంలో ఉన్న విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ భవనం వద్ద ఉన్న ఓ నీటిస ంప్‌లో ప్రమాదవశాత్తు ఓ జింక పడిపోయింది. విషయం తెలుసుకున్న విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. స్థానికుల సాయంతో అటవీ అధికారులు జి ంకను రక్షించి స్వాధీనం చేసుకున్నారు. సమీప అటవీ ప్రాంతంలో జింకను వదిలినట్లు అటవీ అధికారులు తెలిపారు.

## దివ్యాంగుడికి లయన్స్‌క్లబ్‌చే వీల్‌ఛెయిర్ వితరణ



**కుప్పంరూరల్, మే 13 ప్రభాతవార్త :** మండలంలోని కంగుంది గ్రామానికి చెందిన మణి అనే దివ్యాంగుడు నడవలేని స్థితిలో ఉన్నాడు. ఇతనికి మంగళవారం 11వేల రూపాయల విలువ చేసే వీల్ ఛెయిర్‌ను కుప్పం లయన్స్‌క్లబ్ తరపున అందించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సలహాదారు మహేష్, ఛైర్మన్ సోమశేఖర్, మాజీ అధ్యక్షుడు సత్యేంద్ర శేఖర్, సభ్యులు సెల్వం, శివ, సర్పంచ్ ధనశేఖర్, నేతలు దివాకర్, షరీఫ్, నవీన్, కార్తీక్ పాల్గొన్నారు.

## సిబిఎస్ఇ ఫలితాల్లో యోగానంద విజయభేరి

శాంతిపురం, మే 13 ప్రభాతవార్త : సిబిఎస్ఇ పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో స్థానిక శ్రీ పరమహంస యోగానంద విద్యాలయ విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఛైర్మన్ గోపాల్ అగర్వాల్, ప్రిన్సిపాల్ ఆజాద్ హుసేన్ తెలిపారు. తేజశ్రీ 475మార్కులు, వరుణ్ 460, తేజశ్రీ రెడ్డి 439మార్కులతో టాపర్లుగా నిలిచారన్నారు. మొత్తం 39మంది విద్యార్థులకు గాను 14మంది డిస్టింక్షన్, 21మంది ఫస్ట్ క్లాస్, 4మంది సెకండ్ క్లాస్‌లో ఉత్తీర్ణత సాధించారన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు, అధ్యాపకుల్ని వారు అభినందించారు.

## కోర్టు ప్రాంగణంలో వాహనాల పార్కింగ్ నిషేధం



**సత్యవేడు, మే 13 ప్రభాతవార్త:** సత్యవేడు జ్యూడిషియల్ కోర్టు ప్రాంగణంలో వాహనాల పార్కింగ్‌పై నిషేధం విధిస్తున్నట్లు స్థానిక ఎస్ఐ రామస్వామి తెలిపారు. కోర్టు ముందు భాగంలో ఎవరు కూడా వాహనాల పార్కింగ్‌కు అనుమతి లేదన్నారు. శ్రీసిటీ కంపెనీ పనులకు వెళ్లే కార్మికులు కోర్టు ముందు భాగంలో వాహనాలను పార్కింగ్ చేసి వెళుతున్నారన్నారు. దీంతో పాటు ఇతరులను కూడా కొందరు వారి ద్విచక్రవాహనాలు,నాలుగు చక్రాలకు సంబంధించి కారు వంటివి ఇక్కడ పార్కుచేయడం వల్ల కోర్టు కార్యకలాపాలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. ఎవరైనా ఇక్కడ వాహనాలు పార్కింగ్ చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుని కేసు నమోదు చేయడం జరుగుతుందని ఎస్ఐ హెచ్చరించారు.

## విబేధాల్లేని పార్టీ కమిటీలను ఏర్పాటు చేయండి - మంత్రి లోకేష్ సూచన



**సత్యవేడు, మే 13 ప్రభాతవార్త:** సత్యవేడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ పరిశీలకులు చంద్రశేఖర్ నాయుడు మంగళవారం అమరావతి క్యాంపు కార్యాలయంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఐటీ మంత్రి నారా లోకేష్‌ని కలిశారు. సత్యవేడు నియోజకవర్గ అభివృద్ధి అంశాలపై చర్చించిన ఆయన కమిటీల ఏర్పాటుపై పలు సూచనలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్, సత్యవేడు అభివృద్ధి విషయంలో దృష్టిసారించాలని సూచించారన్నారు. ఎన్నడూ లేని విధంగా టీడీపీ హయాంలో మరింత అభివృద్ధి చేసి చూపాలని, అందుకు కావాల్సిన సహకారం అందించుటకు తాము సిద్ధంగా ఉన్నట్లు మంత్రి తెలిపినట్లు ఆయన తెలిపారు. అలాగే టీడీపీ కమిటీల ఏర్పాటు విషయంలో అందరిని కలుపుకుని పోవాలని, విబేధాలు, మనస్పర్థాలకు తావులేకుండా పార్టీ జెండాను తమ భుజాలపై మోస్తున్న కార్యకర్తలకు సముచిత స్థానం కల్పించాలని సూచనలు చేసినట్లు చంద్రశేఖర్‌నాయుడు తెలిపారు.

## సిబిఎస్ఈ ఫలితాల్లో విజయం విద్యార్థుల ప్రతిభ



**చిత్తూరురూరల్, మే 13 ప్రభాతవార్త:** నేడు విడుదల చేసిన సిబిఎస్ఈ(12,10 తరగతులు) ఫలితాల్లో విజయం సిబిఎస్ఈ పాఠశాల విద్యార్థులు తొలలి ప్రయత్నంలోనే అద్భుత ఫలితాలు సాధించి జిల్లాలో అగ్రస్థానంలో నిలిచారని విద్యాసంస్థల అధినేత డా.ఎం.తేజోమూర్తి తెలిపారు. 12వ తరగతి ఫలితాల్లో... కెఎస్ జాగృతి (465), భవ్యశ్రీ (417),యోషిక (406), కీర్తన( 405మార్కులు), 10వ తరగతి ఫలితాల్లో ఎంఎస్ శ్రేయా (570), సుహానాఖాన్ (564), దినేష్‌రాజ్ (555), ప్రేమశ్రీ( 545), చాణుక్య (536) మార్కులు సాధించారన్నారు. అద్భుత ఫలితాలు సాధించి తమ సంస్థకు గర్వకారణంగా నిలిచిన విద్యార్థులను, ఫలితాల సాధనకు కృషిచేసి విద్యార్థులను ప్రోత్సహించిన అధ్యాపక బృందంను విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ డా.ఎం.శైలజామూర్తి అభినందించారు.

## ప్రభుత్వంచే 'కడ'కు సలహా కమిటీ నియామకం

**కుప్పం, మే 13 ప్రభాతవార్త:** ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడ)కు రాష్ట్ర ప్రభుత్వం సలహా కమిటీని నియమించింది. ఈమేరకు ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి పీయూష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో కడకు పరిపాలన, పొలిటికల్ కమిటీలను నియమించారు. కడ అడ్మినిస్ట్రేటివ్ ఛైర్మన్‌గా ఐఎఎస్ అధికారి వికాస్ మర్మత్, సభ్యులుగా ఎపిడి, ఆర్డీఓ శ్రీనివాసులురాజు నియమితులయ్యారు. అలాగే కడ పొలిటికల్ ఛైర్మన్‌గా ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్, సభ్యులుగా ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, బిఆర్ సురేష్‌బాబు, రాజ్‌కుమార్, రామచంద్ర, వెంకటేష్, సతీష్‌కుమార్, సుగుణ, రఘుపతిలను నియమించింది.

## పార్టీ మారిన కౌన్సిలర్లు సస్పెండ్

**కుప్పం, మే 13 ప్రభాతవార్త :** నియోజకవర్గంలో అసమ్మతి నేతలు, పార్టీ మారిన కౌన్సిలర్లను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ జిల్లా వైకాపా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ అధినేత వైఎస్ జగన్ ఆదేశాల మేరకు శాంతిపురం జడ్పీటిసి శ్రీనివాసులు, వసనాడు మాజీ సర్పంచ్ మురళి, మొరసనపల్లి నీల జగదీష్, రామకుప్పం ఆరేళ్ల జయప్ప, విద్యార్థి విభాగం మాజీ జిల్లా అధ్యక్షుడు చీలేపల్లి రవి, మాజీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సర్దార్ బాషాలపై సస్పెన్షన్ వేటు పడింది. వీరు పార్టీ కార్యకలాపాలకు వ్యతిరేకంగా వ్యవహరించడంతో సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు. అలాగే కుప్పం మున్సిపాలిటీకి చెందిన ఒకటో వార్డు కౌన్సిలర్ జగదీష్, 3వవార్డు కౌన్సిలర్ అరవింద్, 4వ వార్డు కౌన్సిలర్ రాజమ్మ, 8వ వార్డు కౌన్సిలర్ చంద్రమ్మ, 13వవార్డు కౌన్సిలర్ హంస, 14వ వార్డు కౌన్సిలర్ మునస్వామి, 15వ వార్డు కౌన్సిలర్ తిలగవతి, 17వ వార్డు కౌన్సిలర్ దేవకి, 21 వార్డు కౌన్సిలర్ లావణ్య, 24వ వార్డు కౌన్సిలర్ సయ్యద్ అలీలను పార్టీ నుంచి బహిష్కరించినట్లు పేర్కొన్నారు.

## సిఎంను కలసిన యువనేత గిరిధర్



**కుప్పం, మే 13 ప్రభాతవార్త :** సిఎం చంద్రబాబునాయుడును శాంతిపురం మండలం కర్లగట్ట యూనిట్ ఇన్‌చార్జ్, యువనేత గిరిధర్ మర్యాదపూర్వకంగా కలిశారు. సచివాలయంలో ముఖ్యమంత్రిని కలసిన గిరిధర్ కుప్పంలో నామినేటెడ్ పదవుల్లో యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని, యువత గత ఎన్నికల్లో తెగించి పోరాడారని కేసులు పెట్టుకుని ఇబ్బందులు పడ్డామని పేర్కొన్నారు. యువతకు తగు గుర్తింపు ఇవ్వాలని కోరగా అందుకు సిఎం చంద్రబాబునాయుడు సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు.

## తెదేపా కార్యకర్త కుటుంబానికి ఐదు లక్షల సాయం



**కుప్పం, మే 13 ప్రభాతవార్త :** గుడుపల్లె మండలం దాసిమానిపల్లికి చెందిన చంద్రయ్య కూలీ పనులకు వెళ్తుండగా రోడ్డు ప్రమాదం జరిగి మృతి చెందాడు. ఇతనికి భార్య, ముగ్గురు పిల్లలు కలరు. తెలుగుదేశం పార్టీ కార్యకర్త అయిన చంద్రయ్య వంద రూపాయలు చెల్లించి పార్టీ సభ్యత్వం పొంది ఉన్నాడు. దీంతో అతని కుటుంబానికి సిఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్‌లు ఐదు లక్షల రూపాయల సాయంను మంజూరు చేశారు. మంగళవారం చెక్కును ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం అందించారు. కార్యక్రమంలోటిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, క్లస్టర్ ఇన్‌చార్జ్ సిఎం రాజు, పంచాయతీ అధ్యక్షుడు గోపి పాల్గొన్నారు.

## కుప్పంలో రైళ్ల స్టాపింగ్‌కై డిఆర్ఎంకు వినతి



**కుప్పం,మే 13 ప్రభాతవార్త :** కుప్పంలో ఈనెల 14-21 తేదీల మధ్య జరిగే శ్రీ తిరుపతి గ ంగమ్మ జాతర సందర్భంగా కుప్పం రైల్వే స్టేషన్‌లో అన్ని రైళ్లకు ఒక నిమిషం స్టాపింగ్ కేటాయించాలని కోరుతూ సాయిమాతా సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు డిఎస్ జగదీష్‌బాబు రైల్వే డిఆర్ఎం అశుతోష్‌కుమార్ సింగ్‌కు వినతిపత్రం అందించారు. ఈనెల 16వతేది నుంచి రైళ్ల స్టాపింగ్ కేటాయించాలని కోరారు. కుప్పం జాతరకు లక్షలాది భక్తులు వస్తారని వారికి అనుగుణంగా రైళ్ల స్టాపింగ్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాగరాజు నాయుడు, కిషోర్‌కుమార్, సురేష్ పాల్గొన్నారు.

## తమిళనాడుకు తరలిన జంట ఏనుగులు

**కుప్పం, మే 13 ప్రభాతవార్త:** రామకుప్పం, కుప్పం మండలాల్లో గత కొంత కాలంగా హల్‌చల్ చేసిన జంట ఏనుగులు ఎట్టకేలకు తమిళనాడు అటవీ ప్రాంతానికి చేరుకున్నాయి. సోమవారం నాడు నడిమూరు అటవీ ప్రాంతానికి చేరిన ఏనుగుల్ని అటవీ అధికారులు, సిబ్బంది తమిళనాడులోకి దారి మళ్లించడంతో అవి తమిళనాడు అటవీ ప్రాంతంలోకి చేరాయి. దీంతో రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారు.

## కాణిపాకంలో ఘనంగా చిత్రా పౌర్ణమి వేడుకలు



**కాణిపాకం, మే 13 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో సోమవారం రాత్రి చిత్రాపౌర్ణమి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా ఆలయంలో చిత్రా పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు ప్రధాన ఆలయం అనుబంధ ఆలయమైన శ్రీశ్రీదేవి, భూదేవి సయిత వరదరాజస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లను అలంకరించి ప్రత్యేక పల్లకిపై వుంచారు. అలాగే ప్రధాన ఆలయంలోని సిద్ది, బుద్ది సమేత గణనాధుని ఉత్సవమూర్తులను అలంకరించి అదే పల్లకిపై వుంచి మంగళ వాయిద్యాల నడుమ ఘనంగా ఊరేగించారు. దీనితో పాటు శ్రీశ్రీదేవి, భూదేవి సయిత వరదరాజస్వామి వార్లకు కూడా ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ పెంచల కిషోర్ దంపతులు, ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్లు కోదండపాణి, వాసు, అర్చకులు, వేదపండితులు, భక్తులు పాల్గొన్నారు.

## శ్రీధనకొండ గంగమ్మ ఆలయంలో ఘనంగా గంగమ్మజాతర



**తవణంపల్లె, మే 13 ప్రభాతవార్త:** మండలంలోని అరగొండ గ్రామంలో వెలసిన శ్రీధనకొండ గంగమ్మ ఆలయంలో గంగమ్మజాతరను మంగళవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా ఆలయంలో గంగమ్మజాతర వేడుకలను నిర్వహిస్తుంటారు. ఈమేరకు ఆలయ ధర్మకర్త ఎం.లోకనాథం యాదవ్ ఆధ్వర్యంలో ఈ జాతర వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో ఉదయం అరగొండ పరిసర గ్రామాలకు చెందిన మహిళలు అమ్మవారికి భక్తి శ్రద్ధలతో అంబలి పోసి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అలాగే శ్రీరాములుగుడి వీధిలో వెలసిన శ్రీసత్యమ్మ ఆలయంలో కూడా మహిళలు ఉదయం నుండి సాయంత్రం వరకు అంబలిపోసి ప్రసాదాలను పంచిపెట్టారు. ఈసందర్భంగా శ్రీధనకొండ గంగమ్మ ఆలయం, శ్రీసత్యమ్మ ఆలయంలు భక్తులతో కిటకిటలాడాయి.

**తవణంపల్లెలో...** మండలంలోని పలు గ్రామాలలో గంగమ్మజారత వేడుకలను అత్యంత ఘనంగా సంప్రదాయబద్దంగా నిర్వహించారు. ఈమేరకు మండలంలోని అన్ని గ్రామాలలో గంగమ్మ ఆలయాల్లో జాతర వేడుకలను నిర్వహించారు. ఈమేరకు తవణంపల్లె, దిగువ తడకర, జొన్నగురకల, మత్యం క్రాస్, ఎగువ తవణంపల్లె, గాజులపల్లె తదితర గ్రామాలలో అమ్మవారి ఆలయాల్లో జాతర వేడుకలను నిర్వహించారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## దొరబావి పుష్కరిణి పునరుద్ధరణకు కృషి : గువ్వల



**చౌడేపల్లి, మే 13 ప్రభాతవార్త :** చౌడేపల్లి పరిధిలోని దొరబావి పుష్కరిణీ పునరుద్ధరణకు కృషి చేస్తున్నట్లు మండల తేదేపా అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి(చిట్టి) అన్నారు. మంగళవారం పుష్కరిణీ పనులకు భూమి పూజ చేసారు. చౌడేపల్లిలో మృత్యుంజయేశ్వరస్వామి ఆలయ నిర్మాణ సమయంలో జమీందారు చిక్కరాయలచే దొరబావి పుష్కరిణి తవ్వించారన్న చరిత్ర వుందన్నారు.ఉపాధిహామీ పథకం ద్వారా పుష్కరిణీ పనులను చేపడుతున్నట్లు ఎంపిడిఓ లీలామాధవి తెలిపారు. ఉపాధి ఎపిఓ చిన్నరెడ్డెమ్మ, తేదేపా సీనియర్ నాయకుడు పూల చంద్రమౌళి, పవన్, కుమార్‌రెడ్డి, బాలిరెడ్డి, ప్రభాకర్, మురళి తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయ భూముల్లో విక్రయాలు జరపరాదు : హనుమంతు



**కొండయ్యగారిపల్లి(చౌడేపల్లి), మే 13 ప్రభాతవార్త :** దేవాలయ భూముల్లో క్రయ విక్రయాలు జరపరాదని తహశీల్దార్ హనుమంతు అన్నారు.మంగళవారం పంచాయతీ కేంద్రం కొండయ్యగారిపల్లిలో వేణుగోపాలస్వామి మాన్యం భూమికి సంబంధించిన స్థలాల విషయమై గ్రామ సభను ఏర్పాటు చేసారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాల మేరకు గ్రామ సభను ఏర్పాటు చేశామన్నారు. మాన్యం భూమిని ఆక్రమించరాదనీ, అమ్మకాలు, కొనుగోలు వంటివి నిషేదమన్నారు. ఎవరైనా అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. అనంతరం మాన్యం భూమిని గ్రామస్తులతో కలసి పరిశీలించారు.

## నిదురపో స్వామీ నిదురపో...!



**చౌడేపల్లి, మే 13 ప్రభాతవార్త :** స్థానిక మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో జరగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారికి ద్వితీయ శయనోత్సవం నిర్వహించారు. ఉదయాన్నే అభిషేక ప్రియుడికి ప్రధానార్చకుడు రాజశేఖర్ దీక్షితుల ఆధ్వర్యంలో విశేషాభిషేకం, అలంకరణగావించారు. రాత్రి శయనోత్సవం జరిగిన తీరు భక్తులను అలరించింది. ఈ కార్యక్రమానికి కెవి.గిరి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు.

## ఆర్డీవో భవాని ఆకస్మిక తనిఖీలు



**పుంగనూరు రూరల్, మే 13 ప్రభాతవార్త :** పట్టణం లో 1,2,4 సచివాలయాల్లో మంగళవారం మధ్యా హ్నం ఆర్డీవో భవాని ఆకస్మిక తనిఖీలు నిర్వహిం చారు. సచివాల సిబ్బంది హాజరు పట్టుకుని పరిశీలిం చారు. సచివాలయ ఉద్యోగులకు పనితీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ, రెవెన్యూ సిబ్బంది సచివాలయ సిబ్బంది పనితీరుపై కలెక్టర్‌కు నివేదిక పంపడం జరుగుతుందన్నారు. పుంగనూరు పట్టణంలోని ఏరియా హాస్పిటల్ నందు మంగళవారం ఉదయం ఆర్డీవో భవాని తనిఖీ నిర్వహించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ అసమర్థత -దూదేకుల ముస్లీం మైనార్టీలకు శాపం



**వెదురుకుప్పం, మే 13 ప్రభాతవార్త :** ప్రభుత్వ అసమర్థత దూదేకుల ముస్లీం మైనార్టీలకు శాపంగా మారిందని నూర్ భాషా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూదేకుల గుండుమల్లి గపూర్ ఆరోపించారు. మండల కేంద్రంలో ఆయన విలేకర్ల సమావేశంలోమాట్లాడుతూ ముస్లీం మైనార్టీలను బిసి బి కేటగిరిలో తక్షణమే నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సాంకేతిక లోపం కారణంగా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలకు వేల మంది దూదేకుల ముస్లీం దూరమవుతున్నారని ప్రభుత్వంగుర్తించాలన్నారు. సరిదిద్దికపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి నూర్ భాషా ముస్లీంలు ఉద్యమానికి శ్రీకారం చుడుతారని హెచ్చరించారు.

## మాంచాలమ్మ ఆలయంలో పాలాభిషేకం



**వెదురుకుప్పం, మే 13 ప్రభాతవార్త :** మాంచాలమ్మ ఆలయంలో మంగళవారం గంగజాతర పురస్కారించుకుని అమ్మవారికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఆలయం శుద్ది చేసి చలువ పందిరిలు వేసి వేపాకులతో ప్రత్యేక అలంకరణ చేశారు. పురోహితులురవిశర్మగారు వేదమంత్రాల నడుమ మహిళ భక్తులచే పాలాభిషకం నిర్వహించి అమ్మవారి దైవదర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న విలేజ్ సర్వేయర్లు




**పూతలపట్టు, మే 13 ప్రభాతవార్త :** మండలంలో విలేజ్ సర్వేయర్ల నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారినది. మండల తాసిల్దారు రైతుల సమస్యలను విని తక్షణమే క్షేత్రస్థాయిలో పరిశీలించి వాళ్లకి న్యాయం చేకూర్చాలని అహర్నిశలు ప్రయత్నిస్తున్న గ్రామ సచివాలయాల్లో ఉన్నటువంటి సర్వేయర్లు రైతుల భూములను సర్వే క్షేత్రస్థాయిలో సర్వేకి పోకుండా రైతులను పదేపదే తమ చుట్టూ తిప్పించుకుంటూ సర్వేపై కూడా సమగ్ర విచారణ జరపకుండా తప్పుడు నివేదికలు ఇస్తూ ఒకరు పాసుబుక్కులో ఉన్నటువంటి భూమిని మరొక పాసుబుక్‌లోకి ఎక్కిస్తూ దాని సరిదిద్దుకోవడంలో తిరిగి మళ్లీ రైతులు తాసిల్దార్ కార్యాలయానికి కాలు అరిగేలా తిరగడం పూతలపట్టు మండలంలో ఉన్న రైతులకు అసౌకర్యంగా మారినది గ్రామ సచివాలయంలో ఉన్నటువంటి సర్వేయర్లు ఇకనైనా రైతుల సమస్యలను పూర్తిస్థాయిలో విని వారికి ఏ విధంగా న్యాయం చేకూర్చాలో ఆలోచించాలన్నారు.

## భక్తి శ్రద్ధలతో గంగ జాతర



**కల్లూరు, మే 13 ప్రభాతవార్త :** పులిచెర్ల శ్రీ గంగమ్మ ఆలయంలో మంగళవారం గంగ జాతర ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో ఉదయం అమ్మవారికి సహస్ర కలశాభిషేకం నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు జరిపారు. మహిళలు అమ్మవారికి పొంగళ్ళు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు రాజశేఖర్ దీక్షితులు మల్లేష్ భరద్వాజ్ పూజా కార్యక్రమాలు జరిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాణి పర్యవేక్షకులు చంద్రశేఖర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, ప్రభాకర్, అనిల్ రెడ్డి, రవి ఆచారి భక్తులు పాల్గొన్నారు.

---

## మదర్‌థెరీసా పాఠశాల విద్యార్థుల ప్రభంజనం



**పెద్దపంజాణి,మే 13,ప్రభాతవార్త:** మండలంలోని మదర్‌థెరీసా సిబిఎస్ఈ పాఠశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. మంగళవారం విడుదలైన 10వ తరగతి సిబిఎస్ఈ ఫలితాలలో పాఠశాలలో 100కు 100శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించా రు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ డా.రవీంద్ర బాబు మాట్లాడుతూ పాఠశాల తొలి సంవత్సరంలోనే 100శాతం విద్యార్థులు ఉతీర్ణత సాధించడం జరిగిందన్నారు.పాఠశాలలో ఎం.తనుజ 92.6 శాతం సాధించి మొదటి స్థానం, ఎస్.చరిష్మా భాను 88.8శాతం సాధించి ద్వితీయ స్థానం, వి.తేజల్ 88శాతం సాధించి తృతీయ స్థానం లోనిలిచారనిఆయన తెలిపారు.పాఠశాల ఉపాధ్యాయులకు,విద్యార్థులకు ఆయన అభినందనలు తెలిపారు.

## డివైడర్ ఢీకొని వ్యక్తి మృతి



**తొట్టంబేడు, మే 13 ప్రభాతవార్త :** ద్విచక్రవాహనంలో వస్తూ డివైడర్ ఢీకొని ఓవ్యక్తి మృతి చెందిన సంఘటన పట్టణ శివారులోని విఎంపల్లి వద్ద చోటుచేసుకుంది. రెండో పట్టణ సిఐ నాగార్జునరెడ్డి కథనం మేరకు అన్నయ్య జిల్లా చిట్వేలు మండలం పత్తిగుంటవాదరిపల్లె గ్రామానికి చెందిన సుధాకర్ రాజు(27) శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకునేందుకు బయలుదేరారు. ఈనేపథ్యం లో విఎంపల్లి వద్ద రోడ్డు పక్కన డివైడర్‌ను గుర్తించక ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న రెండో పట్టణ సిఐ నాగార్జునరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టు మార్టంనిర్వహించికుటుంబసభ్యులకుఅప్పగించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

## ద్విచక్రవాహనాల కేసులో ఇద్దరికి రిమాండ్

**శ్రీకాళహస్తి, మే 13 ప్రభాతవార్త :** ద్విచక్రవాహనాల చోరీ కేసులో గోగుల సునీల్, మేకల ప్రభుదాస్ అనే నిందితులకు శ్రీకాళహస్తి న్యాయసత్థానం ఈనెల 23వ తేదీ వరకు రిమాండ్ విధించినట్లు రెండో పట్టణ సిఐ నాగార్జునరెడ్డి తెలిపారు. పట్టణంలోని కొండమిట్ట ప్రాంతంలో కొంతకాలం కిందట ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయినట్లు సిఐ తెలిపారు.వీటిని చోరీ చేసిన గోగుల సునీల్, మేకల ప్రభుదాస్ అనే వారిని కావలి పోలీసులు అక్కడ కేసులకు సంబంధించి అరెస్టు చేశారన్నారు. సబ్‌జైలులో ఉన్న వీరిని పీటి వారెంటుపై శ్రీకాళహస్తి న్యాయస్థానంలో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ పెంచుతూ ఆదేశాలు జారీచేసినట్లు సిఐ నాగార్జునరెడ్డి తెలిపారు.



## డ్రైవర్లకు ట్రాఫిక్‌పై అవగాహన



**తొట్టంబేడు, మే 13 ప్రభాతవార్త :** ండో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో సిఐ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో ఆర్టీసి బస్టాండు వద్ద ఉన్న ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తి పట్టణంలో ఆటోలు ఎక్కువయ్యా యని దీంతో ప్రజలు ట్రాఫిక్‌తో ఇబ్బందులు తలెత్తుతున్నారని వివరించారు. ఆటోస్టాండ్లు ఉన్న రైల్వేస్టేషన్, ఏపిసీడ్స్, రామసేతువంతెన, ఆర్టీసి బస్టాండు వద్ద ఉన్న ఆటో డ్రైవర్లకు పలుసూచనలు సలహాలు ఇచ్చారు. సిఐతో పాటు పోలీసు సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.



జాతర వేడుకల్లో మంగళవారం మాజీమంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు, ఆర్‌కె రోజా కుటుంబసభ్యులు పాల్గొన్నారు. ఉదయం గంగమ్మకు సారెను తీసుకువచ్చిన మాజీమంత్రులు ఆలయంలో అమ్మవారికి సారె సమర్పించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ జయకుమార్, అర్చకులు అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## రైతుల వ్యవసాయ స్టార్టర్లు చోరీ

**శ్రీకాళహస్తిరూరల్, మే 13 ప్రభాతవార్త**



ఏర్పేడు మండలం సరస్వతీ కండ్రిగ గ్రామ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 50 స్టార్లకు కేబుల్‌వైర్లు చోరీ చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవసాయానికివిద్యుత్‌లేకవేసినవరినారుమడులు ఎండిపోతున్నాయనిఆగ్రహంరైతులుతీవ్ర ఇబ్బందులకు గురికాకుండా అధికారులు చర్యలుతీసుకుని రైతులకు తగిన న్యాయం చేయాలని కోరారు.

## శివయ్యసేవలో హైకోర్టు జడ్జి



**శ్రీకాళహస్తి,మే 13 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయం లో మంగళవారం రాష్ట్ర హైకోర్టు జడ్జి డాక్టర్ వెంకటజ్యోతిర్మయి ప్రతాప్ కుటుంబసభ్యులతో స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఏర్పాట్లును ఆలయ పిఆర్ఓ రవి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ సుదర్శనం నాయుడు పర్యవేక్షించారు.

## తుమ్మలగుంట అభివృద్ధి ఆస్తులను తుడాకు ఎలా అప్పగిస్తారు

- మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డిని విమర్శించే స్థాయి, అర్హత ఎవ్వరికిలేదు



తిరుపతిరూరల్, మే13 ప్రభాతవార్త: తుమ్మలగుంట గ్రామ పంచాయతీలో అభివృద్ధి ఆస్తులను ప్రజా ఆమోదం లేకుండా తుడాకు ఎలా అప్పగిస్తారని స్థానిక మహిళలు ప్రశ్నించారు. తుమ్మలగుంట గ్రామ పంచాయతీని అన్ని విధాల అభివృద్ధి చేసిన మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డిపై టిడిపి అవాకులు చవాకులు విసరడంపై స్థానిక మహిళలు విరుచుకుపడ్డారు. పంచాయతీ పరిధిలోని కెవిఎస్ పార్కు అభివృద్దిని చూసి ఓర్వలేకనే టిడిపి నాయకులు విమర్శలు చేస్తున్నారని తెలిపారు. అనాగరికంగా ఉన్న తుమ్మలగుంట గ్రామ పంచాయతీని చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దారని తెలిపారు. తుమ్మలగుంట కెవిఎస్ పార్కును రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా అభివృద్ధి చేసారని తెలిపారు. అన్ని విధాల అభివృద్ధి చేసిన కెవిఎస్ పార్కును తుడ స్వాధీనం చేసుకోవాలనే ఆలోచన విరమించుకోవాలన్నారు. తుమ్మలగుంట పార్కుపై తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి వాక్యలను స్థానిక మహిళలు ఖండించారు. కెవిఎస్ పార్కును యధావిధిగా ఉంచాలే తప్ప, తుడా స్వాధీనం చేసుకుంటే వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తుమ్మలగుంట మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## కిటకిటలాడిన నాగాలమ్మ అమ్మవారి ఆలయం



తొట్టంబేడు, మే 13 ప్రభాతవార్త: తిరుపతి జాతర, మరియు నేడు జరగబోయే బిపి అగ్రహారం జాతర సందర్భంగా అగ్రహారంలో మలుపు వద్ద వెలసిన నాగాలమ్మ ఆలయం వద్ద భక్తులు కిటకిటలాడారు. ఉదయం నుంచి ఎన్నడూ లేని విధంగా ఎండను కూడా లెక్కచేయకుండా అగ్రహారం, శ్రీరాంనగర్ కాలనీ నుంచి భక్తులు విచ్చేసి నాగాలమ్మ అమ్మవారిని దర్శించుకుని భక్తులకు అంబళ్ళు పోసారు. కాగా అమ్మవారికి అంబళ్ళుపోసేందుకు ప్రత్యేక పాత్రను ఏర్పాటు చేశారు. వెయ్యిమందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

# తిరుపతి డివిజన్

## ఎల్ఐసి బ్రాంచ్ 2 ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదం వితరణ



**తిరుపతి విద్య మే 13 ప్రభాత వార్త** తిరుపతి శ్రీ తాతయ్య గుంట గంగమ్మ జాతర సందర్భంగా ఎల్ఐసి బ్రాంచ్ 2 ఆధ్వర్యంలో మంగళవారం అమ్మవారి భక్తులకు పెరుగు అన్నం, పులిహోర, చక్కెర పొంగల్ పంపిణీ చేశారు. సుమారు 4000 మందికి పంపిణీ చేయడం జరిగింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అమ్మవారి ఆలయం వద్ద భక్తులకు ప్రసాదం పంపిణీ చేసి అమ్మవారి పట్ల తమ భక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ వి.గురునాథా చారి, ఎల్ఐసి యూనియన్ నాయకులు కృష్ణ కుమార్, బాల కృష్ణయ్య, ఇ.వి రమణ, మల్లిక, విద్యావతి, రాము, తారాపతి, మధన్, తదితరులు పాల్గొన్నారు.

## వెటర్నరీ కాలేజీలో విసిఐ బృందం పర్యటన

**తిరుపతి విద్య మే 13 ప్రభాత వార్త**

శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ పరిధిలోని తిరుపతి ఎస్వీ వెటర్నరీ కళాశాలను పరిశీలించేందుకు వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా బృందం మూడు రోజులపాటు పర్యటించనుంది. 14వ తేదీ బుధవారం నుంచి 16వ తేదీ వరకు వీసీఐ తనిఖీ బృందం పర్యటిస్తుంది. కళాశాల సీబీఎస్సీ లోని సౌకర్యాలు, సిబ్బంది పనితీరును ఈ బృందం పరిశీలించనున్నట్లు వెటర్నరీ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతి రామయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారతీయ వెటర్నరీ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తంగై వేలు, మహారాష్ట్రలోని అకోలా నుండి మైక్రో బయాలజీ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్ పి అవంద్కర్ లు కళాశాలలో తనిఖీకి విచ్చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

## లాడ్జిల యజమానులతో కమిషన్‌కై లొల్లి



**శ్రీకాళహస్తి, మే 13 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి దేవస్థానంలో భద్రతా ఉద్యోగిగా పని చేస్తూనే ప్రవేట్ లాడ్జిల మేనేజర్లు యజమానులతో కమిషన్లకు ప్రాకులాడుతున్నారు. దేవస్థానంలో సెక్యూరిటి ఉద్యోగం కోసం తమకు అనుకూలంగా ఉన్న నాయకులతో పైరవీలు చేసుకోవటం యూనిఫారం వేసుకోని ప్రైవేట్ లాడ్జిల్లో యాత్రికులకు గదులు ఇప్పించి, కమీషన్లు తీసుకోవడం అనావాయితీగా మారింది. అదే విధంగా దేవస్థానంలో దర్శనాలకు కూడా దేవస్థానం సెక్యూరిటీ సిబ్బంది బగా ఆలవాటు పడివున్నారు. తమ విధుల పట్ల బాధ్యత లేకుండా ధనార్జనే ధ్యేయంగా భక్తులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. నాలుగుగేట్ల వద్ద విధులను కోరుకోవటం సూపర్‌వైజర్లకు మామూళ్ళలు ఇవ్వడం జరుగుతున్నది. శ్రీకాళహస్తి కార్‌పార్కింగ్ వద్ద పని చేసే ఓ సెక్యూరిటి యువ కుడు ఓ లాడ్జి వద్దకు ఓ పార్టీని తెచ్చానని కమిషన్ ఇవ్వమని లాడ్జి మేనేజర్‌తో వాగ్వివాదానికి దిగారు. అయితే లాడ్జి మేనేజర్‌తో కమిషన్ కోసం డిమాండ్ చేసారు. నువ్వు సెక్యూరిటి కదా అని ప్రశ్నించగా ఆతను నేను రెండుపనులు చేసుకుంటానని వాదించారు. ఇలా సెక్యూరిటి పరిస్థితి మారటంతో పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

## బోరు మరమ్మతులు



**శ్రీకాళహస్తి, మే 13 ప్రభాతవార్త:** పట్టణంలోని 32వ వార్డు దర్గా మిట్ట వీధిలో చాలాకాలంగా బోరు రిపేరుకు గురైంది. అయితే గతంలో ఎందరికో విన్నవించు కున్నా, అధికారులకు మొరబెట్టుకున్నా పట్టించుకోలేదు. వేసవి కాలం గుక్కెడు నీటికై తల్లడిల్లుతూ పంచాయతీరాజ్ అతిధి గృహం వద్ద ఎంఎల్ఏ ఉన్నారని తెలుసుకొని బాలాజి లేన్‌కు చెందిన ప్రజలు శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి దృష్టికి తెచ్చారు. ఆయన వెంటనే అధికారులకు ఆదేశించారు. దాంతో ఈ ప్రాంతాల్లోని నాలుగుబోర్లను ఒక్కసారిగా మున్సిపల్ అధికారులు మరమ్మతులు చేసారు. అధికారులతో పాటు 32వ వార్డు ఇన్‌చార్జి పోలూరు శ్రీనివాసులురెడ్డి, పాలవర్తి యశ్వంత్, మునిరాజయాదవ్, షేఖ షాహబుద్దిన్, లోకేష్ ఆచారి, టిడిపినాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎండిపుత్తూరు సచివాలయంలో ఆధార్ నమోదు



శ్రీకాళహస్తిరూరల్, మే 13 ప్రభాతవార్త : ఏర్పేడు మండలం ఎండిపుత్తూరు సచివాలయం పరిధిలో మంగళవారం ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆధార్‌నమోదు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. సచివాలయ పంచాయతి కార్యదర్శి భువనేశ్వరి సారథ్యంలో నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు అవగాహన కల్గి ఉండాలన్నారు. నేడు ప్రభుత్వం ఏ పథకాన్ని అమలు చేయాలన్నా ఆధార్ ఆధారం కోరుతున్నారని వివరించారు. ఒక వేళ గతంలో పేర్లలో తప్పులున్నా, అలాగే పసిబిడ్డల ఆధార్ కాకున్నా ప్రస్తుతం చేసుకోవాలని సూచించారు. వచ్చిన వారికి త్వరగా నమోదు చేయటానికి డిజిటల్ అసిస్టెంట్ మణి, వెల్ఫేర్ అసిస్టెంట్ వినోద్, కార్యదర్శి ప్రియదర్శిని, రాజశేఖర్ యాదవ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామ కమిటీ అధ్యక్షుడిగా బాలాజీనాయుడు



***విజయపురం, మే 13 ప్రభాతవార్త:*** మండలంలోని గంగమాంబాపురం టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా బి.బాలాజీ నాయుడు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బాలాజీనాయుడు గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికవ్వడం ఇది 13 పర్యాయమని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నా మీద నమ్మకం ఉంచి పార్టీ పెద్దలు, స్థానిక ప్రజలు నన్ను గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పరిశీలకులు డి.ధనంజయనాయుడు, మండల నాయకులు రమేష్‌రాజు, శివలింగం, గుణ భూషణమ్మ, మురళీ నాయుడు, పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ప్రత్యేక అవసరాల గల పిల్లల కొరకు సర్వే



**చంద్రగిరి, మే 13 ప్రభాతవార్త:** ప్రత్యేక అవసరాలు గల బడిఈడు పిల్లల కోసం ఐఈఆర్‌టిలు సర్వే చేస్తున్నట్లు ఐఈ జిల్లా కోఆర్డినేటర్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. స్థానిక దర్శివీధి, చర్చివీధి, బ్రాహ్మణ వీధి, జమండ్ల వీధులలో భవిత ఐఈఆర్‌టిలు మంగళవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆయన ఎంఈఓ-2 భాస్కర్‌బాబుతో కలసి పరిశీలించారు. పిల్లలకు ఉపకరణాలు, అలవెన్సులను సమగ్రశిక్ష ద్వారా ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల పట్ల సమాచారం వున్నట్లయితే భవిత కేంద్రానికి తల్లిదండ్రుల ద్వారా పంపాలని సూచించారు. ఈ సర్వేలో ఎన్.వెంకట రాజేశ్వరీ, ఎస్.శ్యామలాదేవి పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.

## పిడుగు పడి ఆవు మృతి



**కల్లూరు, మే 13, ప్రభాతవార్తపులిచెర్ల** మండలం గడ్డం వారి పల్లి పంచాయతీ ఉప్పు వడ్డిపల్లిలో మంగళవారం సాయంత్రం పిడుగు పడి ఆవు మృతి చెందింది. గ్రామానికి చెందిన పాడి రైతు నీరు గట్టు చంగయ్య. తన పాడి అవును ఇంటి ముందర చెట్టు వద్ద ఉంచగా పిడుగు పడటంతో ఆవు మృతి చెందింది. రూ. 80000 విలువ గలిగిన పాడి ఆవు మృతి చెందడంతో రైతు తీవ్ర ఆవేదనకు లోన య్యాడు. పాడి ఆవు పై రైతు జీవనం సాధిస్తున్నాడు. ఇదే సమ యంలో చెట్టు కింద ఉన్న గ్రామానికి చెందిన బాలుడికి పిడుగుపాటు శబ్దానికి ముక్కు చెవిలో నుంచి రక్తం రావడంతో కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు.

## 15న ఉచిత వైద్య శిబిరం

కేవీబీ పురం, మే 13 ప్రభాతవార్త: కేవీబీపురం మండలంలోని రాగిగుంట హైస్కూలు వద్ద శ్రీకాళహస్తి అన్నపూర్ణ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయకుమార్, ఛైర్మన్ విజయకేర్ ఆస్పత్రి డాక్టర్ అన్నపూర్ణమ్మ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు రాగిగుంట హైస్కూలు వద్ద ఉచిత మెగా మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ క్యాంపులో నెల్లూరు విజయకేర్ ఆస్పత్రి వైద్యులతో పాటు మెడికవర్ ఆస్పత్రి ప్రముఖ వైద్యులు పాల్గొంటున్నట్లు తెలిపారు. షుగర్, చిన్న పిల్లలు, ఎముకలు, కీళ్ళ వ్యాధి నిపుణులు, దంత వైద్యంతో పాటు, వాసన్ ఐ కేర్ ద్వారా కంటి పరీక్షలు చేయబడుతుందన్నారు. ఈ వైద్య శిబిరంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సదావకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ విజయకుమార్ కోరారు.

## డిమాండ్లు పరిష్కరించాలని పిటిఓ ఉద్యోగుల ధర్నా



తిరుపతి(రవాణ), మే 13 ప్రభాతవార్త: దీర్ఘకాలంగా పరిష్కారంకాని డిమాండ్ల సాధనకోసం ప్రజారవాణా ఉద్యోగుల యూనియన్ నాయకులు నిరసన తెలిపారు. మంగళవారం ఉదయం డిపో పరిధిలో యూనియన్ నాయకులు జిల్లా సెక్రటరీ బిఎస్ బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్.భాస్కర్‌నాయుడు, రాష్ట్ర కార్యదర్శి జెవి భాస్కర్, అధ్యక్షుడు పెరుమాళ్ ఆర్టీసిలో దీర్ఘకాలంగా అనేక సమస్యలతో ఉద్యోగులు ఇబ్బందులు పడతున్నారన్నారు. భవిష్యత్తులో డిమాండ్ల పరిష్కారానికి ఉద్యమాలు తప్పవన్నారు. ఈ నిరసనలో ఆర్టీసి యూనియన్ నాయకులలు పెరుమాళ్, గుణశేఖర్, తాళ్లమోహన్, డివిఆర్ కుమార్, అహమ్మద్, ఆర్ముగం, డిపిటిఓ కార్యాలయం యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## గంగమ్మభక్తులకు అన్నదానం

**తిరుపతి(రవాణ), మే 13ప్రభాతవార్త :**

తాతయ్యగుంటగంగమ్మజాతర వేడుకలు సందర్భంగా మంగళవారం మధ్యాహ్నం అమ్మవారి భక్తులకు రాయలసీమ రంగస్థలి, బిజెపి నాయకులు అన్నదానం చేశారు. టాటానగర్ కూడలిలో రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, రవిప్రసాద్ తదితరులు కలసి అన్నదానం చేశారు.

## ట్రాఫిక్ క్రమబద్దీకరణ పై పోలీసులు ఉక్కు పాదం



**రేణిగుంట మే 20 ప్రభాతవార్త :** అర్బన్ ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు డీఎస్పీ శ్రీనివాసరావు సూచనలతో అర్బన్ సీఐ జయచంద్ర, రూరల్ సీఐ మంజునాథరెడ్డి, అర్బన్ ఎస్సై అరుణ్ కుమార్ రెడ్డి, గాజులమండ్యం ఎస్సై సుధాకర్ తమ సిబ్బందితో మంగళవారం ట్రాఫిక్ క్రమబద్దీకరణ కోసం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ఎక్కడ ట్రాఫిక్కు అవరోధం కలిగినా తక్షణం స్పందిస్తున్నారు. సాయంత్రం మండలంలోని వివిధ ప్రాంతాల్లో కూడళ్లలో వాహన తనిఖీలు చేపట్టారు. ఎలాంటి వాహనాన్ని అయినా నిలిపి అన్ని రికార్డులను, డ్రైవింగ్ లైసెన్సులను పరిశీలించారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడపకూడదని ద్విచక్ర వాహన చోదకులకు తెలియజేశారు. అతిగా ప్రవర్తించిన కొంతమందికి ఫైన్లు విధించారు. పోలీసుల తనిఖీలను దూరం నుండి గమనించి వాహనదారులు అడ్డదారుల్లో వెళ్లకుండా అక్కడ కూడా పోలీసులను నియమించి కేసులు రాశారు. డ్రైవింగ్ చేస్తున్న వారు స్త్రీ పురుష భేదం లేకుండా అన్ని వాహనాలను పరిశీలించారు. ముఖ్యంగా పాపా నాయుడు పేట క్రాస్, మర్రిగుంట క్రాస్‌ల వద్ద గాజులమండ్యం ఎస్సై సుధాకర్ వాహనాల వేగాలను పరిశీలించారు. వేగంగా వెళుతున్న వాహనాలను నిలిపి డ్రైవర్లకు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తూ వేగంగా వెళ్లకూడదని సూచించారు.

## కేవీబీ పురంలో ముత్తు అమ్మవారి తిరుణాళ్ళ



**కేవీబీపురం, మే 13 ప్రభాతవార్త:** చిత్రపౌర్ణమి సందర్భంగా సంతానమారి ముత్తు అమ్మవారి తిరుణాళ్లు కేవీబీ పురంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం మారి ముత్తు అమ్మవారి ఆలయం నుంచి భక్తులు పొంగళ్లు తీసుకెళ్లి గ్రామదేవత సత్యమ్మకు పూజించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం అమ్మవారిని మంగళ వాయిద్యాల నడుమ ఊరేగించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు పాల్గొని అమ్మవారిని మొక్కులు తీర్చుకున్నారు. సంతానం లేని మహిళలు అమ్మవారిని పూజిస్తే సంతాన భాగ్యాన్ని కల్పిస్తుందని భక్తిశ్రద్ధలతో సంతానమారి ముత్తు అమ్మవారిని పూజించాలన్నారు. ఆలయ ధర్మకర్త అగులు నారాయణ వారి దంపతులు మాల దీక్షల సహకారంతో కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు.

## పుత్తూరు స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు

**పుత్తూరు రూరల్, మే 13 ప్రభాతవార్త:** నగరి కరియమాణిక్యస్వామి ఆలయంలో కంచి గరుడసేవ ఉదయం నుంచి నగరి పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ ఊరేగింపు ఇరువైపులా భక్తుల రద్దీని భక్తులకు ఎటువంటి అవాంచనీయ కార్యక్రమాలు జరగకుండా సేవలను జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ వెంకటేశ్వరులు ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి విజయకుమార్ పర్యవేక్షణలో 30 మంది స్కౌట్స్ సేవలను గైడ్ కెప్టెన్ లక్ష్మి, రేంజర్ లీడర్ యువశ్రీ, భూ లోకేశ్వరి, ఓవియా, ఇతర విద్యార్థులు పాల్గొన్నారు.

## ఫీల్డ్ అసిస్టెంట్ ఉపాధి పనులు కల్పించలేదు



**తిరుపతిరూరల్, మే13 ప్రభాతవార్త:** ఉపాధి హామీ పని కల్పించకుండా ఫీల్డ్ అసిస్టెంట్ గోపి ఇబ్బంది పెడుతున్నాడని ఉపాధి కూలీ చరణ్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేసారు. ఈ మేరకు మంగళవారం తిరుపతిరూరల్ ఎంపిడిఓ రామచంద్రను కలిసి వినతిపత్రం అందజేసారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్త అనే కారణంతోనే తనకు ఉపాధి పని కల్పించలేదని, గోపి అరాచకాలకు అడ్డులేకుండా పోయిందని, ఉద్దేశపూర్వకంగానే పని కల్పించలేదన్నారు. పనులకు వెళ్ళినప్పుడు పక్క పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ కూడా అడ్డుపడుతున్నాడని ఆరోపించారు. ఎంపిడిఓ స్పందించి ఉపాధి పని కల్పించాలని వేడుకున్నారు.

## ఎన్ డి ఎఫ్ కి కెవిఆర్ జ్యువలర్స్ 10 లక్షలు విరాళం



***తిరుపతి విద్య మే 13 ప్రభాత వార్త*** భారత్ పాకిస్తాన్ మధ్య జరుగుతున్న పోరు నేపథ్యంలో దేశం కోసం ప్రాణాలు ఒడ్డి పోరాడుతున్న భారత సైనికుల సౌకర్యార్థం కె.వి.ఆర్ జువెలరీ షోరూమ్ అధినేత కె.వి.ఆర్ నారాయణమూర్తి మంగళవారం 10 లక్షలు విరాళం అందించారు. ఈ విరాళం సొమ్మును నేషనల్ డిఫెన్స్ ఫండ్స్ కు ఆన్లైన్ ద్వారా అందించి సైనికులు పట్ల తమ ఊదాలతో చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం కోసం నిరంతరం పోరాడుతూ దేశ సంరక్షణను ప్రజా సంక్షేమాన్ని కాంక్షిస్తున్న గొప్ప పోరాట యోధులు భారత సైనికులని తెలిపారు. అలాంటి సైనికుల పట్ల ప్రజలందరూ సానుకూలంగా స్పందించి తమకు తోచిన సాయాన్ని అందించి భారతదేశ సైనికుల్లో మనో ధైర్యాన్ని నింపాలని ఆకాంక్షించారు. నారాయణమూర్తి సతీమణి స్వర్ణ గౌరీ, కుమారుడు రామకృష్ణ, కోడలు విజయలక్ష్మి, మరో కుమారుడు శ్రీనివాస్, నారాయణమూర్తి సేవా నేతలు తమ సహకారాన్ని అందించారు

## పది,ఇంటర్ సీబీఎస్ఈ ఫలితాలలో ఎడిఫై ప్రభంజనం.

**- గ్రేడ్ 10, గ్రేడ్ 12 లోను 100శాతం ఉత్తీర్ణత**



**తిరుపతి విద్య మే 13 ప్రభాత వార్త** తిరుపతి ఎడిఫై స్కూల్ విద్యార్థులు మరోసారి తమ సత్తా చాటారు. మంగళవారం విడుదలైన సి బి ఎస్ ఈ గ్రేడ్ 10, గ్రేడ్ 12 ఫలితాలలో నూరు శాతం ఉత్తీర్ణతను సాధించి ప్రతిభ కనబరిచారు. సి బి ఎస్ ఇ గ్రేడ్ 10లో సాయి హర్ష్.జి 494/500 మార్కులు అలాగే సి బి ఎస్ ఇ గ్రేడ్ 12(పి సి ఎం)లో తేజస్.కే 482/500 మార్కులను సాధించి జిల్లా పరిధిలోనే మొదటి స్థానంలో నిలిచారు. ఈ నేపద్యంలో ఎడిఫై స్కూల్ డైరెక్టర్ ప్రణీత్ పెనుమాడు అత్యధిక మార్కులను సాధించిన విద్యార్థులను అభినందించారు. అలాగే రాబోయే కాలంలో విద్యాపరంగా మరిన్ని ఉన్నత స్థానాలు అధిరోహించాలని విద్యార్థులను ప్రోత్సహించారు. అలాగే ఉత్తమ ఫలితాలు సాధించడానికి కృషిచేసిన పాఠశాల ఉపాధ్యాయులను సిబ్బందిని కొనియాడారు

## భాష్యం విద్యాసంస్థల ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ.



**తిరుపతి విద్య మే 13 ప్రభాత వార్త** భగభగ మండుతున్న ఎండలకు గొంతులో కాసిన్ని మంచినీళ్లు పడితే ప్రాణం కాస్త కుదుటపడుతుంది మరి చల్లని మజ్జిగ తాగితే మరింత ఉపశమనం కలుగుతుందని భావించిన భాష్యం విద్యాసంస్థల చైర్మన్ రామకృష్ణ మార్గ దర్శకత్వంలో భాష్యం జోనల్ ఇన్చార్జి లక్ష్మణరావు మంగళవారం స్థానిక గంగమ్మ జాతరకు విచ్చేసిన భక్తులకు సుమారు 3000 మంది భక్తులకు మజ్జిగ పంపిణీ ఆయన ఆధ్వర్యంలో చేయడం జరిగింది. మధ్యాహ్నం ఎండ వేడిమి నుండి భక్తులు ఉపశమనం పొందేలా భక్తులకు చల్లని మజ్జిగ పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందని భాష్యం విద్యాసంస్థల ప్రిన్సిపల్స్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ శ్రీనివాసులు, నేతాజీ, ఆంజనీయులు, బాలాజీ ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సీబీఎస్ఈ ఫలితాల్లో లిటిల్ ఏంజెల్స్ ప్రభంజనం



**తిరుపతి విద్య మే 13 ప్రభాత వార్త** సీబీఎస్ఈ పదవ తరగతి ఫలితాలలో తిరుపతి లోని లిటిల్ ఏంజెల్స్ స్కూల్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. మంగళవారం సీబీఎస్ఈ ఫలితాలును ప్రకటించారు. ఈ ఫలితాలలో లిటిల్ ఏంజెల్స్ స్కూలు విద్యార్థులు హేమ స్వరూప్ 492/500, పోగూరి వికాస్ 489/500, భావజ్ఞ 488/500 అత్యధిక మార్కులు సాధించి స్కూలు టాపర్లుగా నిలిచారు. ఈ సందర్భంగా స్కూలు కరస్పాండెంట్ కే రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాలలో చదివిన విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. స్కూల్ టాపర్లను స్కూల్ డైరెక్టర్, ఛైర్ పర్సన్ డాక్టర్ శ్వేత, రమాదేవిలు అభినందించి సత్కరించారు. అత్యధిక మార్పులు సాధించడంలో ప్రతి ఏటా పురోగతి సాధిస్తున్నామని వారు తెలిపారు.

## భక్తులను ఆకట్టుకున్న పద్మాకళాక్షేత్ర డ్యాన్స్‌అకాడమీ



తిరుపతి(రవాణ), మే 13ప్రభాతవార్త : తమిళనాడు మలియాదతురై కొన్నెరాజ పురంలోని ఉమామహేశ్వరస్వామి ఆలయంలో చిన్నారుల నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. పద్మాకళాక్షేత్ర డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వాహకు రాలు శ్రీదేవిబాలాజీ, చిన్నారులు రిషిక, సాయిసంజన, తేజ, కుషిశ్రీ, హేమలత తమ అద్భుత నృత్యప్రదర్శన చేశారు. ఆలయ నిర్వాహకులు చిన్నారుల అద్భుత నృత్యానికి అవార్డులు అందజేశారు.

## ఆకట్టుకున్న పొన్నాలమ్మ ఆలంకరణ

**-నేడు బిపి అగ్రహారం జాతర**



శ్రీకాళహస్తి, మే 13 ప్రభాతవార్త : వేసవి కాలం వచ్చిందంటే శ్రీకాళహస్తిలో జాతర సంబరాలు మొదలైనట్లే. ఈనేపధ్యంలో మంగళవారం బిపి అగ్రహారంలో ఉన్న గంగమ్మ మూలవిరాట్టుకు ప్రత్యేక అలంకరణ, ఇక మార్కెట్‌కమిటీ సమీపంలో ఉన్న పొన్నాలమ్మ ఆలయంలో ఉన్న అమ్మవారు పొన్నాలమ్మ అమ్మవారి అలంకరణ ఇట్టే ఆకట్టుకుంది. దీంతో పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు పోటెత్తారు. బిపి అగ్రహారం ఆలయం వద్ద ఆలయ అర్చకులు హరి ఆధ్వర్యంలో అమ్మవారికి పూజా కార్యక్రమాలు చేపట్టారు. కాగా నేడు అర్ధరాత్రి బిపి అగ్రహారం అమ్మవారిని సప్పరంలో ఊరేగింపు నిర్వహించి అగ్రహారం అమ్మవారి ఆలయం వద్ద కొలుదీర్చనున్నారు. పొన్నాలమ్మ ఆలయం వద్ద ఆలయ చైర్మన్ పుదూరు లక్ష్మణరెడ్డి ఆధ్వర్యంలో వచ్చిన భక్తులకు అమ్మవారి దర్శనం అయ్యేలా చర్యలు తీసుకున్నారు.

## పొన్నాలమ్మ అమ్మవారికి పొంగళ్ళు



శ్రీకాళహస్తి, మే 13 ప్రభాతవార్త : బిపి అగ్రహారం జాతర సందర్భంగా ఉదయం అగ్రహారంలో వెలసిన అమ్మవారి మూలవిరాట్టుకు విశేష సంఖ్యలో సుగంధద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించి అలంకరణ చేపట్టారు. అమ్మవారిని దర్శించుకోవడానికి విశేష సంఖ్యలో హజరై అమ్మవారిని దర్శించుకున్నారు. కాగా తిరుపతి, పుత్తూరుకు చెందిన మహిళలు బిపిఅగ్రహారం అమ్మవారి ఆలయం నుంచి తప్పెట్లు మోతల నడుమ మహిళలు మండుటెండలో కాలినడకన పొన్నాలమ్మ అమ్మవారి ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని ఆలయ ఆవరణలో పొంగళ్ళు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. నేడు రాత్రి బిపి అగ్రహారం జాతర అంగరంగవైభవంగా నిర్వహించనున్నారు

## అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే నాని



**పాకాల, మే 13 ప్రభాతవార్త:** మండలం పాకాల గంగ జాతర సందర్భంగా శ్రీ సత్యమ్మ తల్లికి చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని మంగళవారం రోజున పట్టు వస్త్రాలను సమర్పించారు. కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే నానికి మంగళ వాయిద్యాలతో, వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ ఆలయ కమిటీ నిర్వాహకులు, స్థానికులు కలిసి ఘన స్వాగతం పలికారు. ఇక్కడ కోరిన కోరికలు తీర్చే ఇలవేల్పు, కొంగు బంగారంగా వెలసి వున్న శ్రీ సత్యమ్మ తల్లి ప్రసిద్ధి చెందిందని గ్రామ దేవతగా స్థానిక ప్రజల ప్రగాఢ నమ్మకం. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, ప్రజలు, భక్తులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## సబ్సిడీ పై పశువుల దాణా పంపిణీ



**పాకాల, మే 13 ప్రభాతవార్త :** పాకాల మండలం పెద్దరామాపురం రైతు సేవా కేంద్ర పరిధిలో ఎస్సీ, ఎస్టీ పాడి రైతులకు పశువుల దాణా పంపిణీ చేశారు. మంగళవారం ఆర్ఎస్‌కె పెద్దరామాపురం సహాయ సంచాలకులు డాక్టర్ రాజమ్మ అసిస్టెంట్ డైరెక్టర్ డిడి తిరుపతి డా. పవన్ కుమార్, విఏఎస్ హిమబిందు, ఎహెచ్ఎ మండల టీడీపీ నాయకులు లబ్ధిదారులుకు 50 శాతం రాయితీతో 555 రూపాయలకు బస్తా చొప్పున అందచేశారు. కూటమి అనంతనేని బాలాజీ. బుల్లి, మోహనకృష్ణ, చలపతి, తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ చెక్కులు పంపిణీ



**వడమాలపేట, మే 13 ప్రభాతవార్త:** అనారోగ్యంతో బాధపడుతున్న వారి వైద్య ఖర్చులు కోసం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ లబ్ధిదారులకు మంగళవారం అందజేశారు. వడమాలపేట మండలంలోని కాయం హరిజనవాడకు చెందిన జి.భాగ్యలక్ష్మికి 1,32,941 రూపాయలు, కాయం గ్రామంలో నారాయణరెడ్డికి రూ.74,670లు, పూడి గ్రామంలో శ్రీరాం జానకిరామయ్యకు రూ.36,608, కదిరిమంగళం గ్రామంలో పూడి దామోధరంకు రూ.1 లక్షా 322లు చెక్కులను ఇళ్ళ వద్దకు అందజేసి వారి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ధనంజయులు నాయ డు, బత్తెయ్య, ఉమాపతిరావు, వెంకటేష్, మురళీధర్‌రెడ్డి, తులసిరామిరెడ్డి, వెంకట్రామనాయుడు పాల్గొన్నారు.

## పిడికిలి గంగమ్మ చల్లగా అందరినీ దీవించమ్మా



**పుత్తూరు రూరల్, మే 13 ప్రభాతవార్త:** పుత్తూరు పట్టణంలోని బజారువీధిలో వెలసిన గ్రామదేవత పిడికిలి గంగమ్మకు తిరుపతి గంగజాతర సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి పాలు, పెరుగు, తేనె పంచామృత అభిషేకాలు, ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేశారు. అలాగే ఆలయ ఆవరణలో భక్తులకు అంబలి ప్రసాదంగా అందించారు. ఆలయాన్ని విద్యుత్‌దీపాలంకరణ వేపాకు తోరణాలతో సుందరంగా అలంకరించారు. కార్యక్రమంలో పట్టణ గ్రామీణ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి మంగళ హారతులు ఇచ్చారు. పిడికిలి గంగమ్మతల్లి అందరిని చల్లగా దీవించమ్మా అంటూ భక్తులు వేషధారణ వేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో గంగజాతర కమిటీ, భక్తులు పాల్గొన్నారు.


కెనరా బ్యాంక్ Canara Bank Together we can

తిరుపతి ప్రధాన -2 శాఖ, తిరుపతి, తిరుపతి జిల్లా

**రుణగ్రహీత/ హామీదారు/ తనఖాదారులకు సెక్షన్ 13(8) క్రింద**

**రిడెంప్షన్ నోటీసు**

**టు: రుణగ్రహీత:శ్రీ సి.మునీంద్ర,** తండ్రి లేట్ గోవిందయ్య, డి.నెం.19-9-3బి, జయనగర్, తిరుపతి - 517501

**హామీదారు: శ్రీ శ్రీ మునీంద్ర కరతపు,** తండ్రి వెంకటముని, డి.నెం.19-10-81, న్యూ ఇందిరానగర్, తిరుపతి - 517501

అయ్యా/ అమ్మా !

**విషయం: సర్ఫేసి చట్టం, 2002లోని సెక్షన్ 13(8) క్రింద ప్రకారం విముక్తి హక్కును అమలు చేయడం కోసం నోటీసు**

తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల గౌరవనీయ హైకోర్టు, హైదరాబాద్ న్యాయవ్యవస్థ నిర్దేశించిన ప్రతిపాదనకు అనుగుణంగా అమ్మకపు నోటీసు ప్రచురణ తేదికి ముందుగా, సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకోవడానికి తనఖాదారునికి 30 రోజుల ప్రత్యేక నోటీసు జారీ చేయబడుచున్నది.

రుణఖాతా శ్రీ సి.మునీంద్ర (రుణగ్రహీత) వారిని బకాయి **రూ.13,31,058.36/- (పదమూడు లక్షల ముప్పై ఒక్క వేల యాభై ఎనిమిది రూపాయల ముప్పై ఆరు పైసలు మాత్రమే)** మరియు వడ్డీ, ఖర్చులు మరియు ఇతర ఛార్జీలతో కలిపి మొత్తం చెల్లించవలసినదిగా కోరుతూ **కెనరాబ్యాంక్, తిరుపతి ప్రధాన-2 శాఖ** యొక్క అధీకృత అధికారి **30.10.2024** వ తేదీన డిమాండ్ నోటీసు జారీ చేయడమైనది.

పైన తెలిపిన డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో మీరు విఫలమైనందున కెనరా బ్యాంక్ యొక్క అధీకృత అధికారి తేది: 19.02.2025న మీ సెక్యూర్డ్ ఆస్తులను లాంఛనాత్మకంగా / భౌతికంగా స్వాధీనం చేసుకున్నారు. మరియు చట్టం ప్రకారం సదరు స్వాధీనతా నోటీసును **వార్త (తెలుగు) మరియు ది హాన్స్ ఇండియా (ఇంగ్లీష్) వార్తాపత్రికలలో తేది: 21.02.2025** న ప్రచురించడమైనది.

ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా మీరు తేది: 30.10.2024 నాటి డిమాండ్ నోటీసులో పేర్కొన బకాయి మొత్తం **రూ.13,31,058.36/- (పదమూడు లక్షల ముప్పై ఒక్క వేల యాభై ఎనిమిది రూపాయల ముప్పై ఆరు పైసలు మాత్రమే)** + వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు కలిపి మొత్తమును చెల్లించి బ్యాంకు వారు స్వాధీనం చేసుకున్న మీ ఆస్తులను విడిపించుకొనుటకు ఆఖరి మరియు చివరి అవకాశం కల్పించడమైనది. ఒక వేళ మీరు చెల్లించుటలో విఫలమైన యెడల దిగువ వివరించి ఏదేని విధానాల ద్వారా అమ్మకం జరుపుటకు దినపత్రికలలో అమ్మకం ప్రకటన ప్రచురితమవుతుంది (ఏ) ఇటువంటి సెక్యూర్డ్ ఆస్తును కొనుగోలు చేయు వారి నుండి లేదా సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయు ఆసక్తి గల వారి నుండి కొటేషన్లు ఆహ్వానించుట లేదా (బి) ప్రజల నుండి టెండరు ఆహ్వానించుట లేదా (సి) ఇ-వేలం పద్ధతిలో బహిరంగ వేలంను నిర్వహించుట లేదా (డి) ప్రైవేట్ ఒప్పందం ద్వారా. దినపత్రికలలో అమ్మకం ప్రకటన ప్రచురణ తేదికి ముందుగా సర్ఫేసి చట్టం యొక్క సెక్షన్ 13(8) ప్రకారం మీరు మీ సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకునే హక్కు కలిగి ఉంటారు, ఒక వేళ విఫలమైనచో, సెక్షన్ 13(8) ప్రకారం ఆస్తిని విడిపించుకునే హక్కును కోల్పోవుదురు. చట్టం నందు / అమలులోవున్న ఏదైనా ఇతర న్యాయపరిధిలో బ్యాంకును ఏలాంటి ఇతర హక్కులకు భంగం వాటిల్లకుండా ఈ నోటీసు జారీ చేయడమైనదని.

స్థలం : తిరుపతి సం॥ అధీకృత అధికారి,

తేది: : 03.05.2025 కెనరా బ్యాంక్



కెనరా బ్యాంక్ Canara Bank Together we can

తిరుపతి ప్రధాన -2 శాఖ, తిరుపతి, తిరుపతి జిల్లా

**రుణగ్రహీత/ హామీదారు/ తనఖాదారులకు సెక్షన్ 13(8) క్రింద**

**రిడెంప్షన్ నోటీసు**

**టు: రుణగ్రహీత:శ్రీ ఎస్.తేజోకుమార్,** తండ్రి విశ్వనాథాచారి, డి.నెం.18-1-381/ఎ, భవాని నగర్, తిరుపతి- 517501

**హామీదారు: శ్రీ రాంబాబు కలగుంట,** తండ్రి వీరబ్రహ్మయ్య, ఫ్లాట్ నెం.12, లక్ష్మీపురం రోడ్డు, పెరుమాళ్ళపల్లి, తిరుపతి - 517501

అయ్యా/ అమ్మా !

**విషయం: సర్ఫేసి చట్టం, 2002లోని సెక్షన్ 13(8) క్రింద ప్రకారం విముక్తి హక్కును అమలు చేయడం కోసం నోటీసు**

తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల గౌరవనీయ హైకోర్టు, హైదరాబాద్ న్యాయవ్యవస్థ నిర్దేశించిన ప్రతిపాదనకు అనుగుణంగా అమ్మకపు నోటీసు ప్రచురణ తేదికి ముందుగా, సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకోవడానికి తనఖాదారునికి 30 రోజుల ప్రత్యేక నోటీసు జారీ చేయబడుచున్నది.

రుణఖాతా శ్రీ ఎస్.తేజోకుమార్ (రుణగ్రహీత) వారిని బకాయి **రూ.6,87,697.15/- (ఆరు లక్షల ఎనభై ఏడు వేల ఆరు వందల తొంభై ఏడు రూపాయల పదహైదు పైసలు మాత్రమే)** మరియు వడ్డీ, ఖర్చులు మరియు ఇతర ఛార్జీలతో కలిపి మొత్తం చెల్లించవలసినదిగా కోరుతూ **కెనరాబ్యాంక్, తిరుపతి ప్రధాన-2 శాఖ** యొక్క అధీకృత అధికారి **30.07.2024** వ తేదీన డిమాండ్ నోటీసు జారీ చేయడమైనది.

పైన తెలిపిన డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో మీరు విఫలమైనందున కెనరా బ్యాంక్ యొక్క అధీకృత అధికారి తేది: 26.11.2024 న మీ సెక్యూర్డ్ ఆస్తులను లాంఛనాత్మకంగా / భౌతికంగా స్వాధీనం చేసుకున్నారు. మరియు చట్టం ప్రకారం సదరు స్వాధీనతా నోటీసును **ఆంధ్రప్రభ (తెలుగు) మరియు ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్(ఇంగ్లీష్) వార్తాపత్రికలలో తేది: 01.12.2024** న ప్రచురించడమైనది.

ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా మీరు తేది: 30.07.2024 నాటి డిమాండ్ నోటీసులో పేర్కొన బకాయి మొత్తం **రూ.6,87,697.15/- (ఆరు లక్షల ఎనభై ఏడు వేల ఆరు వందల తొంభై ఏడు రూపాయల పదహైదు పైసలు మాత్రమే)**+ వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు కలిపి మొత్తమును చెల్లించి బ్యాంకు వారు స్వాధీనం చేసుకున్న మీ ఆస్తులను విడిపించుకొనుటకు ఆఖరి మరియు చివరి అవకాశం కల్పించడమైనది. ఒక వేళ మీరు చెల్లించుటలో విఫలమైన యెడల దిగువ వివరించి ఏదేని విధానాల ద్వారా అమ్మకం జరుపుటకు దినపత్రికలలో అమ్మకం ప్రకటన ప్రచురితమవుతుంది (ఏ) ఇటువంటి సెక్యూర్డ్ ఆస్తును కొనుగోలు చేయు వారి నుండి లేదా సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయు ఆసక్తి గల వారి నుండి కొటేషన్లు ఆహ్వానించుట లేదా (బి) ప్రజల నుండి టెండరు ఆహ్వానించుట లేదా (సి) ఇ-వేలం పద్ధతిలో బహిరంగ వేలంను నిర్వహించుట లేదా (డి) ప్రైవేట్ ఒప్పందం ద్వారా. దినపత్రికలలో అమ్మకం ప్రకటన ప్రచురణ తేదికి ముందుగా సర్ఫేసి చట్టం యొక్క సెక్షన్ 13(8) ప్రకారం మీరు మీ సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకునే హక్కు కలిగి ఉంటారు, ఒక వేళ విఫలమైనచో, సెక్షన్ 13(8) ప్రకారం ఆస్తిని విడిపించుకునే హక్కును కోల్పోవుదురు. చట్టం నందు / అమలులోవున్న ఏదైనా ఇతర న్యాయపరిధిలో బ్యాంకును ఏలాంటి ఇతర హక్కులకు భంగం వాటిల్లకుండా ఈ నోటీసు జారీ చేయడమైనదని.

స్థలం : తిరుపతి సం॥ అధీకృత అధికారి,

తేది: : 03.05.2025 కెనరా బ్యాంక్

## రీ సర్వేతో అన్నదాతలకు ఎంతో మేలు : తహశీల్దార్



కోట, మే 13 ప్రభాతవార్త: రాష్ట్రప్రభుత్వం చేపడుతున్న రీసర్వేతో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కోట మండల తహశీల్దార్ కె.జయజయరావు చెప్పారు. కోట మండలం ఇలుకూరుపాడు గ్రామంలో జరుగుతున్న రీసర్వేను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే చేసే ముందు రైతులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. గ్రామంలోని రైతుల భూములు, గ్రామ సరిహద్దులు, నీటి వనరుల లభ్యత, పోరంబోకు భూములను సర్వే చేసి ఖచ్చితమైన సరిహద్దులు ఏర్పాటు చేయాలని సూచించారు. తద్వారా రైతులకు, భూ యజమానులకు మేలు జరుగుతుందన్నారు. రైతుల సమక్షంలోనే కొలతలు కొలిచి హద్దులు నిర్ణయించాలని చెప్పారు. అనంతరం రైతులతో ముఖాముఖి నిర్వహించి సర్వే చేస్తున్న తీరుపై అడిగి తెలుసుకున్నారు. రీసర్వేలో తప్పులు దొర్లకుండా పారదర్శకంగా చేయాలని సర్వే బృందాలకు సూచించారు. ఆయన వెంట మండల సర్వేయర్ గోపీరెడ్డి తదితరులు ఉన్నారు.

## వేనాడులో పూలంగి సేవ లక్షార్చన



తడ, మే 13 ప్రభాతవార్త : మండలం వేనాడు దీవిలోని శ్రీరంగపెరుమాళ్ ఆలయంలో మంగళవారం మహాతిరమంజనం, పూలంగి సేవ లక్షార్చన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామానికి చెందిన అశోక్ మొదలి, దండపాణి మొదలి, మణి మొదలి, భాస్కర్, కృపాకర్‌లు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో స్వామివారిని పూలతో అలంకరించి అభిషేకాలు జరిపారు. బుధవారంతో ఇక్కడ జరుగుతున్న ప్రత్యేక పూజలు ముగియనున్నాయి. మంగళవారం లక్షార్చనకు గ్రామస్థులతో పాటు సమీప గ్రామాల దంపతులు కూడా హాజరై స్వామి కార్యంలో పాల్గొన్నారు.

## ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన కరుణకుమారి



బాలాయపల్లి, మే 13 ప్రభాతవార్త : వెంగమాంబపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గా జి. కరుణకుమారి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఇంచార్జ్ ప్రిన్సిపాల్‌గా ఉన్న లెక్చరర్ వెంకటగిరికి బదిలీ చేశారు. కరుణ కుమారి నెల్లూరు డీకే డబ్ల్యూ కళాశాల నుండి వెంగమాంబపురం జూనియర్ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా బదిలీ చేశారు. కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రిన్సిపాల్ కరుణ కుమారిని ముని లక్ష్మి, ఆదిలక్ష్మి, రాంగోపాల్ స్వాగతం పలికారు. ప్రిన్సిపాల్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఫోటో

## పుస్తకాలు వచ్చేశాయ్..!



కోట, మే 13 ప్రభాతవార్త : 1 నుంచి 10వ తరగతి వరకు మొదటి సెమిస్టర్ పాఠ్య పుస్తకాలు వచ్చాయని కోట మండల విద్యాశాఖ అధికారి మస్తానయ్య చెప్పారు. మంగళవారం జిల్లా కేంద్రం తిరుపతి నుంచి ఈ పుస్తకాలు కోటకు వచ్చినట్లు తెలిపారు. మండలంలోని 77 పాఠశాలలకు 25 వేల పుస్తకాలు వచ్చాయని తెలిపారు. ఈ పాఠ్య పుస్తకాలను పాఠశాలలు పునఃప్రారంభం రోజునే డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతో కిట్ల రూపంలో పుస్తకాలు అందజేస్తామన్నారు. మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 9600 మంది విద్యార్థులకు తల్లికి వందనం కింద అర్హత ఉందని చెప్పారు.

## మహిళలకు రిజర్వేషన్ కల్పించనున్న ప్రభుత్వం : ఎమ్మెల్యే



వెంకటగిరి, మే 13 ప్రభాతవార్త : మహిళలు ఆర్థికంగా ఉండేందుకే కూటమి ఎప్పుడు వద్దాం కుట్టుపై శిక్షణ ఇచ్చి వారికి ఉచితంగా మిషన్లు పంపిణీ చేస్తున్నట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి మండల పరిషత్ కార్యాలయంలో కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. మహిళల సంక్షేమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకుంటుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తనుజా రెడ్డి, ఎంపీడీవో కోటేశ్వరరావు, కమిషనర్ వెంకటరామిరెడ్డి, సిఐ ఏవి రమణ, మండల పరిషత్ ఉపాధ్యక్షులు సుధాకర్, నాయకులు శివారెడ్డి, దొంతుబాలకృష్ణ, బాబు నాయుడు, చిన్నారెడ్డి నాయకులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి పాతర

కోట, మే 13 ప్రభాతవార్త : టిడిపి కూటమి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి పాతరేసి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమల్లోకి తీసుకొచ్చిందని వైసీపీ ఇంటలెక్చువల్ కోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌వి సుబ్రహ్మణ్యంరెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ప్రభుత్వ దౌర్జన్యాలు, ఆగడాలు, ఆకృత్యాలకు, అవినీతికి అడ్డుకట్ట లేకుండా పోతుందన్నారు. మహిళలకు రక్షణ కరవయిందన్నారు. అన్యాయాన్ని ప్రశ్నిస్తే వారిపై అక్రమ కేసులు బనాయించి జైల్లో పెట్టి చిత్రహింసలకు గురిచేస్తున్నారన్నారు. ఒక పక్క ఇసుక మాఫియా, మరో వైపు మైనింగ్ దోపిడి చర్యలను వైసీపీ ఇంటలెక్చువల్ ఫోరం తీవ్రంగా ఖండిస్తుందన్నారు.

## పిడుగుపాటుకు గురైన యువకుని పరామర్శ



తడ, మే 13 ప్రభాతవార్త : తడ గ్రామ పంచాయతీ పరిధిలోని పల్లెపాలెం వద్ద సోమవారం సాయంత్రం పిడుగు పడి మృతిచెందిన డేవిడ్ కుటుంబాన్ని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మంగళవారం పరామర్శించారు. వారి స్వగ్రామం సున్నపు బట్టి ప్రాంతానికి వెళ్లి యువకుని మృతదేహాన్ని సందర్శించారు. ప్రభుత్వం ద్వారా ఆ కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఆమెతో పాటు టిడిపి నాయకులు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, కామిరెడ్డి మురళీరెడ్డి, తెలుగు యువత రవి, పార్థసారధి తదితరులు పాల్గొన్నారు. మృతుని కుటుంబానికి అంత్యక్రియల ఖర్చుల కోసం ఎమ్మెల్యే రూ.5 వేలు అందజేశారు.

## తడ-అక్కంపేట రైల్వేస్టేషన్ల మధ్య గుర్తు తెలియని శవం



తడ, మే 13 ప్రభాతవార్త : తడ-అక్కంపేట రైల్వేస్టేషన్ల మధ్య మంగళవారం సుమారు 40 సంవత్స రాల వయస్సు ఉన్న ఒక గుర్తు తెలి యని వ్యక్తి శవాన్ని రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎగువ రైలు మార్గంలో ఈ శవం పడి ఉంది. ఏదయినా రైలులో ప్రయాణం చేస్తూ ప్రమాదవశాత్తు జారిపడి మృతిచెందినట్లు భావిస్తున్నారు. తడ రైల్వే స్టేషన్ మాస్టర్ ఇచ్చిన సమాచారంతో జిఆర్‌పి ఎస్ఐ వై.చెన్నకేశవ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని రైల్వే పోలీసులు తెలిపారు. తెలుగు నలుపు రంగు కలిగిన చొక్కా, సిమెంటు కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతుని కుడి చేతికి ఆరంజ్ కలర్ కాశీ దారం, దానికి వెంకటేశ్వరస్వామి ప్లాస్టిక్ డాలర్ ఉందని, మెడలో నల్లని దారం ధరించి ఉన్నాడని పేర్కొన్నారు. శవాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యార్థుల మార్గనిర్దేశంలో అధ్యాపకులు కీలకం

- బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్
-కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్‌లో మిషన్ లెర్నింగ్..ఎఐపై శిక్షణ




కుప్పం, మే 13 ప్రభాతవార్త : విద్యార్థులు, భవిష్యత్తు ప్రొఫెషనల్స్‌కు మార్గనిర్దేశం చేయడంలో అధ్యాపకుల పాత్ర ఎంతో కీలకమని కుప్పం బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్ పేర్కొన్నారు. కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్‌లో కర్నూలుకు చెందిన అకెనార్ టెక్నాలజీస్‌తో కలసి నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం, మెషిన్ లెర్నింగ్, ఎఐపై శిక్షణ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ తరహా శిక్షణ కార్యక్రమాలు అధ్యాపకుల దృష్టిని పరిశోధన మరియు నూతన ఆవిష్కరణల వైపు మళ్లిస్తాయన్నారు. వైస్ ఛైర్మన్ సునీల్ రాజ్ మాట్లాడుతూ మెషిన్ లెర్నింగ్, ఎఐ టెక్నాలజీలు నేటి విద్యావిధానానికి మార్గదర్శక శక్తులు అన్నారు. ఈకార్యక్రమం ద్వారా అధ్యాపకులు పరిశ్రమల అవసరాలు అర్థం చేసుకుని విద్యార్థులకు వాస్తవ ప్రపంచ పరిజ్ఞానాన్ని అందించగలుగుతారన్నారు. ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబు మాట్లాడుతూ అధ్యాపకులు నిరంతరం సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపుచేసుకుంటే విద్యా ప్రమాణాలు ఉన్నత స్థాయికి తీసుకెళ్లవచ్చన్నారు. అనంతరం అధ్యాపకులకు, రిసోర్స్ పర్సన్లకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్అండ్‌డి డైరెక్టర్ కోదండరామయ్య, కన్వీనర్ డా॥ రాసదురై, హెచ్ఒడిలు, సెక్షన్ ఇన్‌చార్జ్‌లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## అగ్రహారం గంగమ్మకు సారె అందించిన దేవస్థానం



శ్రీకాళహస్తి,మే 13ప్రభాతవార్త : శ్రీకాళహస్తి అగ్రహారంలో గంగమ్మ జాతర సంబరాలు మంగళవారం ఉదయం నుంచి ప్రారంభమయ్యాయి. తిరుపతి తాతయ్యగుంట జాతరతో పాటు అగ్రహారం జాతరను నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం నుంచి అగ్రహారం జాతర సందర్భంగా పొన్నాలమ్మగుడి వద్ద పొంగళ్ళను మహిళలు సమర్పించారు. కాగా పొంగళ్ళు నిర్వహించుకొనుటకు ఆలయ ఛైర్మెన్ పుదూరు లక్ష్మణరెడ్డి సారథ్యంలో ఏర్పాటు చేసారు.

**సారె సమర్పించిన దేవస్థానం:**

శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి అనుబంధ ఆలయాలు, సమీపంలోని ఆలయాలకు 'సారె సమర్పించే' సంప్రదాయాన్ని దేవస్థానం ప్రవేశపెట్టారు. మంగళవారం రాత్రి కన్నుల పండువగా అంగరంగ వైభవంగా యువకుల నృత్యాలతో ఎంఎల్‌ఏ బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి కుటుంబానికి చెందిన బొజ్జల సురేష్‌రెడ్డి తెలుగు దేశం నాయకులు, కార్యకర్తలు రాగా దేవస్థానం నుంచి సారెను అందించారు. ఈ కార్యక్రమాల్లో సురేష్‌రెడ్డితో పాటు మాజీ మార్కెటింగ్ కమిటి ఛైర్మెన్ రంగినేని చెంచయ్య నాయుడు, పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్, మాజీ పట్టణ మహిళా అధ్యక్షురాలు బి.రేణుకమ్మ, మల్లీశ్వరమ్మ, కంఠా రమేష్, పోలూరు శ్రీనివాసులు రెడ్డి, ఎంఎస్‌రెడ్డి, కృష్ణమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## సింహ, ముత్యపుపందిరి వాహనాలపై వేంకటేశ్వరుని



నారాయణవనం, మే 13 ప్రభాతవార్త : నారాయణవనం పుణ్యక్షేత్రంలో వెలసిన పద్మా వతీదేవి సమేత కల్యాణ వే ంకటేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబందించి మంగళవారం ఉదయం కల్యాణ వేంకటేశ్వరుడు సింహ వాహనాన్ని అధిరోహించి నగరవీధుల్లో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాత్రి 9గంటలకు కల్యాణ వేంకటేశ్వరున్ని ముత్యపుపందిరి వాహనంపై మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ భక్తులకు దర్శనం భాగ్యం కల్పించారు. భక్తులు అడుగడుగునా టెంకాయహారతులు, నైవేద్యం సమర్పించుకున్నారు. అంతకు ముందు ఉదయం ఆలయంలో సుప్రభాత సేవతో శ్రీవారిని మేల్కొల్పారు. తర్వాత నిత్యకట్ల, మొదటి గంట, బేరితాడనము నిర్వహించారు. సింహ వాహనంపై ఊరేగిన కల్యాణ వేంకటేశ్వరునికి ఘనంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. పాలు, పెరుగు, నెయ్యి, కొబ్బరినీళ్లు, పశుపు వంటి సుగంధద్రవ్యాలతో స్నపనతిరుమంజనం చేయడం భక్తలను విశేషంగా ఆకట్టుకుంది. సాయంత్రం 6గంటల నుంచి ఊంజల్‌మండపంలో ఊ ంజల్‌సేవను ఘనంగా నిర్వహించారు. ఊంజల్‌సేవ సందర్భంగా అన్నమయ్య సంకీర్తలను వినిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీవారి సేవలో తరించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, కోలాటం, చెక్కభజనల నడుమ శ్రీవారు భక్తులకు అభయమిచ్చారు. స్వామి అమ్మవార్ల ఊరేగింపు సందర్భంగా కేరళ వాయిద్యం మరింత ఆకట్టుకుంది. భక్తులు అడుగడుగునా టెంకాయహారతులు, నైవేద్యం సమర్పించుకున్నారు. భక్తులకు టిటిడి అధికారులు శ్రీవారి మహాప్రసాదాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీఇఓ నాగరత్న, ఎఇఓ రవి, సూపర్‌టెండెంట్ ధర్మయ్య, ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, ఆర్జితంఇన్స్‌పెక్టర్ భరత్, అర్చకులు శ్రీధర్‌భట్టాచార్యులు, నరసింహరాఘవ భట్టాచార్యులు, శ్రీనివాస భట్టాచార్యులు, వివిధ శాఖలకు చెందిన టిటిడి అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

## సిబియస్ పరీక్షల్లో శ్రీకాళహస్తి విద్యార్థి ప్రతిభ



శ్రీకాళహస్తిరూరల్,మే 13 ప్రభాతవార్త : సిబియస్ పదవ తరగతి పరీక్షా ఫలితాలు మంగళవారం వెలవడ్డాయి.ఈ ఫలితాల్లో శ్రీకాళహస్తి మండలం ఎంపేడు పంచాయతీలోని ఓ గ్రామీణ బాలిక 96శాతం మార్కులు సాదించింది. ఎంపేడుకు చెందిన మాజీ మండల ఉపాధ్యక్షుడు తాటిపర్తి ఈశ్వర్‌రెడ్డి మనవరాలు సింగిల్ విండో అధ్యక్షుడు తాటిపర్తి రవీంద్రరెడ్డి కుమార్తె తన్విశ్రీ అత్యధిక మార్కులు సాధించినట్లు వివరించారు. ఈ బాలిక తిరుపతి సమీపంలోని క్యాండర్ ఇంటర్నేషనల్ పాఠశాలలో సిబియస్ సిలబస్‌లో పదవ తరగతి పరీక్షకు హాజరయ్యారు. ఈ ఫలితాలు వెలినిసాయి. ఫలితాల్లో బహుశా జిల్లాలోనే అత్యధిక మార్కులు సాధించినట్లు సమాచారం. దాంతో ఆ బాలికను పలువురు అభినందించారు.

## టిడిపి పట్టణ అధ్యక్షుడుగా ధనంజయరెడ్డి




చంద్రగిరి, మే 13 ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ చంద్రగిరి పట్టణ అధ్యక్షుడుగా సక్కుర్ ధనంజయ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు టిడిపి మండల అధ్యక్షుడు, డిసిఎంఎస్ ఛైర్మన్ పల్లినేని సుబ్రమణ్యం నాయుడు ప్రకటించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో జరిగిన పార్టీ సమావేశంలో అధ్యక్షుడుగా సక్కుర్ ధనంజయ రెడ్డి పేరు పలువురు నాయకులు ప్రతిపాధించారు. అదేవిధంగా టిడిపి చంద్రగిరి పట్టణ కార్యదర్శిగా కొత్తపేటకు చెందిన హరిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రగిరి పట్టణంలో పార్టీ బలోపేతానికి తమవంతు కృషి చేస్తామన్నారు. ఎంఎల్ఏ పులివర్తి నాని చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళతామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్మన్ గౌస్‌భాషా, ఈ కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్, తుడా మాజీ డైరెక్టర్ ఏజి పల్లి బాల, టిడిపి యూత్ మండల అధ్యక్షుడు రాజులగారి వినోద్‌కుమార్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు శానంబట్ల తులసిరెడ్డి, కడియాల రవితేజ యాదవ్, నాయకులు చెరుకూరి లీలాకృష్ణ, శంకర్, ప్రభాకర్‌నాయుడు, గురుమూర్తిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మారెమ్మ తల్లో... చల్లంగా చూడమ్మ తల్లో!



రేణిగుంట మే 13 ప్రభాతవార్త : మముగన్న తల్లో.. మారమ్మ తల్లో చల్లంగా చూడమ్మా.. మనసున్న తల్లో.. అంటూ రేణిగుంట మండలం ఎల్లమండ్యం ఎస్సీ కాలనీ మంగళవారం మారు మోగింది. తిరుపతి శ్రీ గంగమ్మ తల్లి జాతర సందర్భంగా అదేరోజు ఎల్లమండ్యం ఎస్సీ కాలనీ పొలిమేరలో శ్రీ మారమ్మ తల్లికి పొంగళ్ళు పొంగించి అంబళ్ల సమర్పించడం ఆనవాయితీగా వస్తున్న ఆచారం. ఈ సంవత్సరం కూడా గ్రామస్తులు ఆనవాయికి తప్పకుండా శ్రీ మారెమ్మ తల్లి జాతరను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో గ్రామస్తులు అమ్మ తల్లికి పూజలు చేశారు. గ్రామస్తులంతా శ్రీ మారెమ్మ తల్లి దీవెనలతో సకాలంలో వర్షాలు కురిసి గ్రామాలు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని వేడుకున్నారు. జాతర వేడుకల్లో గ్రామ పెద్దలు, మహిళా భక్తులు, గ్రామస్తులు, ఇతర గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## 22న హనుమాన్ శోభాయాత్ర



వెంకటగిరి, మే 13 ప్రభాతవార్త: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణని ఈనెల 22వ తారీకు జరగబోవు హనుమాన్ శోభాయాత్రకు విశిష్ట అతిథిగా ఆహ్వానించారు. వెంకటగిరి పుర ప్రజలు ఉద్దేశించి కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. విశ్వహిందూ పరిషత్ వారు మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా వెంకటగిరి పట్టణంలో ఈ శోభాయాత్రను వైభవ్వేతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి దొంతు బాలకృష్ణ, విశ్వనాథం, విశ్వహిందూ పరిషత్ సీనియర్ నాయకులు యారం శ్రీనివాసులు, కార్యదర్శి అలిమిలి మల్లికార్జున, కోశాధికారి కాసుల సుధాకర్, నాగరాజా, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## కృప సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం



గూడూరు, మే 13 ప్రభాతవార్త : పట్టణంకి సమీపంలో ఉన్న పోటు పాలెం, చలివేంద్ర గుంట ఎస్టీ కాలనీలో ఉన్న 70 మంది నిరుపేదలకు మంగళవారం యంగల ప్రేమ్ కుమార్, ప్రసన్న దంపతుల యంగల,ప్రణయ చిన్నారి, జన్మదిన సందర్భంగా కృప సేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు కేకు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యదాతగా వ్యవహరించిన తాత, కసుకుర్తి కోటేశ్వరరావు అమ్మమ్మ భారతి దంపతుల పూర్తి సహాయ సహకారాలతో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అత్తి మంజరి గోపాలు, పర్వతల రమేష్, పేయ్యల రమణయ్య, చవల సురేంద్ర బాబు, ఈగ వాసు, శివ, కొండూరు శ్రీనివాసులు పాల్గొన్నారు.

## గూడూరుకు చేరుకున్న వయాసిస్ జననీ యాత్ర



గూడూరు, మే 13 ప్రభాతవార్త: సంతాన సాఫల్యతపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆంధ్ర తెలంగాణ రాష్ట్రాల్లో జరుగుతున్న వయాసిస్ జననీ యాత్ర గూడూరు పట్టణానికి చేరుకుంది. గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంకు వయాసిస్ ఫెసిలిటీ జననీ యాత్ర చేరుకుంది సంతాన సాఫల్యతపై పిల్లలు లేని తల్లిదండ్రులకు అవగాహన ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ క్యాంపును రోటరీ మాజీ డిస్టిక్ గవర్నర్ కొణిదల మునిగిరీష్ ప్రారంభించారు. వయాసిస్ ఫెర్టిలిటీ హెడ్ డాక్టర్ పల్లవి మాట్లాడుతూ మదర్స్ డే సందర్భంగా నెలరోజుల పాటు ఆంధ్ర తెలంగాణలో జనని యాత్ర నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. సంతాన ఉత్పత్తిని పెంచేందుకు జననీ యాత్ర జరుగుతుందని పేర్కొన్నారు. ఈ శిబిరంలో రాజేష్, శశిధర్, తిరుపతి బ్రాంచ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధి కూలీ కుటుంబ సభ్యులకు పరామర్శ



వాకాడు, మే 13 ప్రభాతవార్త: ఎన్ఆర్ఈజీఎస్ ఉపాధి పనులు చేస్తుండగా వడదెబ్బ తగిలి పడిపోయి మార్గ మధ్యంలో మృతి చెందింది. వివరాల్లోకి వెళితే వాకాడు మండలం రావిగుంటపాలెం గ్రామానికి చెందిన కలివేలమ్మ అనే మహిళ రోజు వారిలాగే కరువు పనికి వెళ్లి పనిచేస్తుండగా వడదెబ్బ తగిలి పడిపోయింది, సమాచార మిచ్చిన అధికారులు కుటుంబ సభ్యులు వచ్చి కలివేలమ్మును తీసుకుని ఆసుపత్రికి వెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందిందని కుటుంబ సభ్యులు అధికారులకు తెలిపారు. మంగళవారం ఎంపీడీవో శ్రీనివాసులు ప్రభుత్వం పరంగా ఆర్థిక సహాయం వచ్చే విధంగా చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చారు. ఆయన వెంట ఏపీవో విజయ, ఈసీ మల్లికార్జున రావు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## రేపు మండల సాధారణ సర్వసభ సమావేశం

వాకాడు, మే 12 ప్రభాతవార్త : మండల పరిషత్ అధ్యక్షురాలు కొడవలూరు అనుసూయమ్మ ఆధ్వర్యంలో 15న ఉదయం మండల సాధారణ సర్వసభ సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఎంపిడిఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ సమావేశంలో వేసవికాలం దృశ్య తాగు నీటి సమస్యపై కూలంకుషంగా చర్చించబడునన్నారు. ఈ సమావేశానికి సర్పంచులు, మండల ప్రాదేశిక నియోజకవర్గం సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, జిల్లా ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొనాలని ఆయన కోరారు.

## ఉరి వేసుకుని వ్యక్తి మృతి

గూడూరు, మే 13 ప్రభాతవార్త: ఉరి వేసుకుని వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. మృతుడు రామలింగయ్య కుమారుడు కావలి సుబ్బారావు (43) గౌతమ్ నగర్ గండవరం కొడవలూరు మండలం నెల్లూరు జిల్లా సుమారు రెండు సంవత్సరాల నుంచి టిడ్కో ఇళ్ల వద్ద భార్య పిల్లలతో నివసిస్తూ నెల్లూరులోని కరెంట్ ఆఫీస్ నందు సబ్బు ఆర్డినేట్‌గా పనిచేస్తూ ఉంటాడు. మృతునికి భార్య నాగేశ్వరి ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు కలరు. మృతులు మద్యానికి ఆన్లైన్ పేకాటకు అలవాటు పడి ప్రతినిత్యం భార్యతో గొడవ పడుతూ భార్య అడిగిందని ఆమెను కొడుతూ ఉంటాడు. ఈ నెల 12వ తేది మృతుడు తన ఇంటి వద్దకు వెళ్లి తన బెడ్రూంలో పడుకోగా తన భార్య తన రెండవకు కుమార్తె మరొక బెడ్ రూమ్‌లోనూ తన తమ్ముని కుమారుడు హాల్లో పడుకుని ఉంటారు మృతుని భార్య మృతని తమ్ముని కుమారుడు నిద్రలేచి మృతునికి డ్యూటీకి టైం అయిందని మృతుని భార్య మృతుని తమ్ముడు కుమారునికి నిద్ర లేపమని చెప్పగా మృతుడు నీ మృతుని కుమారుడు నిద్ర లేపడం కొరకు మృతుడి పడుకొని ఉన్న బెడ్ రూమ్ తలుపును కట్టగా మృతుడు ఎంతటి పలకకు పోయేసరికి మృతుని తమ్ముని కుమారుడు తలుపును వారగా తెరచి చూసే సరికి మృతుడు ఇంట్లోనే సీలింగ్ ఫ్యాన్‌కు చేరత ఉరివేసుకొన చనిపోయి ఉన్నాడు.

## ఎక్సైజ్ స్టేషన్‌ని తనిఖీ చేసిన ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్



వాకాడు, మే 13 ప్రభాతవార్త : వాకాడు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌ను ఆకస్మికంగా ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమీషనర్ విజయశేఖర్ తనిఖీ చేసారు. అనంతరం స్టేషన్‌లో రికార్డ్స్‌ను పరిశీలించారు. అనంతరం బెల్టు షాపులు మీద, కల్తీ కల్లు అమ్మకాలు మీద ప్రత్యేక నిఘా ఉంచి కేసులు నమోదు చేయాలని తెలిపారు. అనంతరం ఎజి షాపుల లైసెన్సు ఫీజులు, అరియర్స్‌లు పరిశీలించి ప్రభుత్వ రాబడిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. ఆయన వెంట వాకాడు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్స్‌పెక్టరు ఆర్‌యువిఎస్ ప్రసాద్, ఎస్సై రషీద్ భాష, హెడ్‌కానిస్టేబుల్స్ రాధాకృష్ణ, రాజయ్య, కానిస్టేబుల్స్ వెంకటేశ్వర్లు, జయచంద్ర, రమణయ్య ఉన్నారు.

## చెరువుల సంరక్షణకు అధిక ప్రాధాన్యత

**- గుడిపాల మండలంలో చెరువులను పరిశీలించిన కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాలలు**

గుడిపాల, మే 13 ప్రభాతవార్త: భూగర్భ జలాల పెంపు, సాగునీటి అవసరాల కోసం చెరువులను సంరక్షించాలని, రానున్న వర్షాకాలం కంటే ముందు చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు మంగళవారం మధ్యాహ్నం గుడిపాల మండలంలోని రామిరెడ్డి చెరువు, రెడ్డమ్మ చెరువు, నారాయణరెడ్డి చెరువు, బంగారప్ప చెరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా వీరు ఆయుకట్టుదారులు, రైతులు, అధికారులతో మాట్లాడారు. చెరువుల్లో పూడిక పేరుకుపోవడం, ఆక్రమణలు జరుగడంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతుందని ఆయకట్టుదారులు కలెక్టర్, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన కలెక్టర్ చెరువుల ఆక్రమణలపై సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఇదే సమయంలో చెరువులో పూర్తి స్థాయిలో పూడిక తొలగించడానికి సత్వరం అంచనాలు రూపొందించి, తీర్మానం చేయించి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి పథకం కింద ఒకొక్క చెరువులో రూ.40 లక్షలతో పనులు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అలాగే బంగారప్ప చెరువు కట్ట పటిష్టతకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం కారణంతో చెరువులో పేరుకుపోయిన మట్టిపై ఎమ్మెల్యే గురజాల, స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకువస్తే సత్వరం మట్టిని అక్కడి నుండి తొలగించాలని నేషనల్ హైవే పిడిని ఆదేశించారు. ఒక చెరువు నుండి మరొక చెరువుకు వచ్చే సప్లై ఛానల్‌ను సర్వే చేసి పూర్తి స్థాయిలో నీటి ప్రవాహంకు వీలుగా సిద్ధం చేయాలన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాలు ప్రారంభం కంటే ముందుగానే చెరువుల్లో పూడికతీత పనులు పూర్తి చేసేలా అధికారులు వేగంగా చర్యలు చేపట్టాలన్నారు. ఇరిగేషన్ ఎస్ఇ వెంకటేశ్వరరాజు, ఇఇ మురళీకుమార్, ఎంపిడిఓ శిరీష, తహసిల్దారు జయంతి, ఎఇ సయ్యద్ పీరా, నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

**PALAMANER MUNICIPALITY**

'e' Procurement 2nd Call Tender Notice Roc.No:155/2024-25-E1, dated: 09.05.2025

**'e' Procurement Tender Notice**

**Tender Notice Nit No: 53, Rs. 4.50 Lakhs**

1. No.of Works General funds : **1 No's**
2. T.S.Amount / E.C.V. Amount : **4.50 Lakhs**
3. Bid Document Downloading Start Date : **12.05.2025 at 3.00 P.M.**
4. Bid Document Downloading End Date :**19.05.2025 at 3.00 P.M.**
5. Bid Document Submission Closing Date :**19.05.2025 at 3.30 P.M.**
6. Price Bid Opening Date:**19.05.2025 at 3.31P.M.**
7. Name & Address of the Concerned Officer : Commissioner, Palamaner Municipality, Palamaner - 517425.

Further details can be seen @ e 'procurement market place at https://tender.apeprocurement.gov.in from 12.05.2025 at 3.00 P.M.

**Sd/- Commissioner, Palamaner Municipality**